ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 4 ఆగస్టు 2025 సంపుటి: 01, సంచిక :88
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ఏడబ్ల్యూఎస్ కొత్త సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మోడల్

బెంగళూరు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) కొత్తగా ఏఐ డ్రివెన్ డెవలప్‌మెంట్ లైఫ్‌సైకిల్ మోడల్‌ను ఆవిష్కరించింది. కైరో, అమెజాన్ క్యూ డెవలపర్‌లాంటి టూల్స్‌ను ఉపయోగించి, కృత్రిమ మేధ (ఏఐ)తో సాఫ్ట్‌వేర్‌ను రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీనితో మానవ పర్యవేక్షణలో కోడింగ్, టెస్టింగ్‌లాంటి పనులను ఆటోమేట్ చేయడం ద్వారా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే వ్యవధిని నెలల నుంచి రోజుల స్థాయిలోకి కుదించవచ్చని సంస్థ తెలిపింది. అలాగే మెరుగైన ఏఐ విధానాలను షేర్ చేసుకునేందుకు ఏఐ-నేటివ్ బిల్డర్స్ కమ్యూనిటీని కూడా ప్రవేశపెట్టినట్లు వివరించింది.


విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news


# యూరియా కోత.. రైతన్న వెత

- వరినాట్లు ఊపందుకోవడంతో పెరిగిన డిమాండ్
- అవసరానికి మించి యూరియా సరఫరా చేశామన్న కేంద్రం ప్రకటనతో గందరగోళం
- డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్..ఇలా అన్ని ఎరువులూ కలిపి చెప్పారంటున్న రాష్ట్ర అధికారులు
- రైతులకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందంటూ ఆందోళన
- వానాకాలానికి 10.48 ఎల్ఎంటీల యూరియా అడిగితే 9.80 ఎల్ఎంటీలే కేటాయించారు
- 4 నెలల్లో 6.60 ఎల్ఎంటీలు ఇవ్వాల్సి ఉంటే ఇప్పటివరకు 4.50 ఎల్ఎంటీలే ఇచ్చారు
- కేంద్రమంత్రికి రాష్ట్ర మంత్రి తుమ్మల లేఖ..తక్షణమే యూరియా సరఫరాకు విజ్ఞప్తి
- ఆగస్టులో కనీసం 2 ఎల్ఎంటీలైనా వస్తేనే గండం గట్టెక్కుతామంటున్న అధికారులు



సూర్య హైదరాబాద్

ఇటీవలి వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో వరినాట్లు ఊపందుకున్నాయి. దీంతో ఎరువుల కోసం డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా అవసరమైన మొత్తంలో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే తీవ్రమైన కొరత నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ విధానంలో ఒక్కొక్కరికి రెండు బస్తాలే ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఈ ఆగస్టు నెలలో రైతుల అవసరాలు తీరాలంటే కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) యూరియా - మిగతా2లో



## ఉత్తరప్రదేశ్‌లో వరదలు

- రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు.. 17 జిల్లాలు జలమయం
- ప్రమాద స్థాయిని దాటిప్రవహిస్తున్న పలు నదులు
- నీట మునిగిన వందలాది గ్రామాలు
- ప్రయాగ్‌రాజ్‌లో 15 వేల ఇళ్లలోకి నీరు



## ఈసీది అధికార దుర్వినియోగం

- రాష్ట్రాల ఎన్నికల స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోంది
- “బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారు.
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం వ్యాఖ్యలను ఖండించిన ఎన్నికల సంఘం

# ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి



- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయి
- అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- అధికారంలోకి వచ్చాక బస్తీల్లో ఉండే పేదల ఇండ్లు కూల్చుతున్నది

సూర్య హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండా ఎగరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టిన గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా నన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 50వేల మంది కార్యకర్తల సభ్యత్వం ఉన్న నియోజకవర్గం జూబ్లీహిల్స్ - మిగతా2లో



## లోకేశ్ మాటలు పట్టించుకోం

- ఏపీ ప్రతిపాదిత బనకచర్లను వ్యతిరేకిస్తున్నాం
- మా ఫిర్యాదుతోనే కేంద్రం ఆ ప్రాజెక్టును తిరస్కరించింది
- గోదావరిలో 968 టీఎంసీల వాటా వాడుకొనేలా ప్రాజెక్టులు కడతాం
- రామగుండం ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో మంత్రి ఉత్తమ్

సూర్య హైదరాబాద్ / పెద్దపల్లి

‘నారా లోకేశ్ సహా ఏపీ మంత్రుల మాటలు పట్టించుకోం. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. అది తెలంగాణ నీటిహక్కుల ఉల్లంఘనే అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి, నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా ఫిర్యాదుతోనే బనకచర్లను కేంద్ర జలసంఘం తిరస్కరించింది. ఏపీ సీఎంతో జరిగిన సమావేశంలోనూ మేం - మిగతా2లో



## రిజిస్టర్డ్ పోస్ట్ ఇక కనుమరుగు

- 50 ఏళ్ల ప్రస్థానానికి తెర.. పోస్టల్ శాఖ నిర్ణయం
- సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ‘రిజిస్టర్డ్ పోస్ట్’ సేవలను కొనసాగించబోమని ‘ది ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్’ ఆదివారం ఒక ప్రకటన

# దక్షిణాది న పోటాపోటీ



- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ రేసులో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ
- జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల దూకుడు
- ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, పర్యాటక రంగాల విస్తరణతో అవకాశాలు



## దేశాధినేతతో ప్రభుత్వాధినేత భేటీ ఆంతర్యమేమిటో!

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఈ వరుస భేటీల వెనక కారణాలు తెలియరాలేదు
- దీనిపై ప్రధాని కార్యాలయం ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు
- అమిత్‌షా మాత్రం రాష్ట్రపతితో తన సమావేశానికి సంబంధించిన ఫొటోను ‘ఎక్స్’లో షేర్ చేశారు.

# ఎన్నో లోపాలు.. ఎందరో బాధ్యులు

- కాళేశ్వరం నివేదికపై ప్రభుత్వం దృష్టి
- అధ్యయనం పూర్తి చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ
- కమిటీతో సమావేశమైన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్
- జస్టిస్ ఘోష్ నివేదిక.. అధికారుల కమిటీ సిఫార్సులపై నేడు మంత్రివర్గ సమావేశం
- తదుపరి చర్యలకు సీఐడీకి బాధ్యతలు?



సూర్య హైదరాబాద్

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతోంది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అనేక లోపాలు, అక్రమాలు జరిగినట్లు తెలపడమే కాక ఏ వైఫల్యానికి ఎవరు బాధ్యులో కూడా కమిషన్ పేర్కొంది. న్యాయ విచారణ కమిషన్‌లు నివేదికలు ఇచ్చినపుడు - మిగతా2లో

# ఎన్నో లోపాలు.. ఎందరో బాధ్యులు

-మొదటిపేజీ తరువాయి

గతంలో ఏ రాష్ట్రంలో ఎలా చేశారు? తదుపరి కార్యచరణ ఏమిటన్న దానిపై మంత్రుల్లో ఇప్పటికే చర్చ జరుగుతున్నా.. సోమవారం మధ్యాహ్నం నిర్వహించే మంత్రివర్గ అత్యవసర సమావేశం జస్టిస్ ఘోష్ నివేదికపై సమగ్రంగా చర్చించనుంది. నివేదికను పరిశీలించి ముఖ్యమైన సిఫార్సులను మంత్రివర్గం ముందు ఉంచడానికి సీఎం రేవంత్‌రెడ్డి ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కమిషన్ ఇచ్చిన 700 పేజీల నివేదికను అధ్యయనం చేసిన కమిటీ పలు అంశాలపై ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. వ్యక్తిగత నిర్ణయాలు, రాజకీయ నాయకత్వ ప్రభావంతో పరిపాలన.. ప్రణాళికల్లో అనేక లోపాలు జరిగాయని, సాంకేతిక అంశాలను విస్మరించారని కమిషన్ నివేదిక తెలిపిందని కమిటీ అభిప్రాయ పడినట్లు సమాచారం. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీలోని అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సాధారణ పరిపాలన ఇన్‌ఛార్జి ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, నీటిపారుదల ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతితో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కమిషన్ నివేదికలోని ముఖ్య అంశాలపై వారు చర్చించినట్లు తెలిసింది.

**మంత్రివర్గ సమావేశం అనంతరం కీలక నిర్ణయం**

ఆర్థిక అవకతవకలు, నిబంధనలకు తూట్లు పొడవడంతో పాటు నిర్మాణ సంస్థతో ప్రాజెక్టు అధికారులు కుమ్మక్కయ్యారని..మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో భారీగా ప్రజాధనం దుర్వినియోగమైందని చెబుతూ ఇందులో ఎవరెవరి పాత్ర ఏమిటో న్యాయ కమిషన్ వివరంగా పేర్కొన్నట్లు తెలిసింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తో పాటు ఐఏఎస్ అధికారులు, సీనియర్ ఇంజినీర్లు ఇలా అనేక మంది పాత్ర గురించి కమిషన్ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తున్న నేపథ్యంలో మంత్రివర్గం తీసుకొనే నిర్ణయాలు..తదుపరి కార్యాచరణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాలన్నది ప్రభుత్వ నిర్ణయం కాదని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు వ్యక్తిగతంగా తీసుకొన్నట్లు పేర్కొనడంతో పాటు బ్యారేజీలు దెబ్బతినడానికి నాటి నిర్ణయాలే కారణమని జస్టిస్ ఘోష్ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

మంత్రివర్గ అనుమతి లేకపోవడం, తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని బ్యారేజీల నిర్మాణ స్థలాన్ని మార్చడం, అంచనాల సవరింపులో అవకతవకలు, నిర్వహణ సరిగా లేకపోవడం, నీటిని మళ్లించడానికి నిర్మించిన బ్యారేజీలలో నీటిని నిత్యం నిల్వ ఉంచడం, నిపుణుల కమిటీ నివేదికను పక్కనపెట్టడం, డిజైన్లలో లోపాలు, నాణ్యతా తనిఖీలు లేకపోవడం, పని పూర్తికాకుండానే పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇవ్వడం ఇలా అనేక అంశాలను కమిషన్ ప్రస్తావించినట్లు తెలిసింది. ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకొన్నారని అప్పటి ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌ను కూడా కమిషన్ తప్పు పట్టినట్లు సమాచారం. వీరితోపాటు మాజీ ప్రధాన కార్యదర్శి, కాళేశ్వరం నిర్మాణ సమయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్.కె.జోషి, ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా ఉంటూ ప్రాజెక్టును పర్యవేక్షించిన స్మితాసభర్వాల్‌తో పాటు మాజీ ఈఎన్సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, నాగేందర్‌రావు, నరేందర్‌రెడ్డి, మాజీ సీఈలు చంద్రశేఖర్, బసవరాజు.. ఈఎన్సీలు టి.శ్రీనివాస్, హరిరాం, సీఈలు సుధాకర్‌రెడ్డి, ప్రమీల తదితరుల పాత్ర గురించి వెల్లడించినట్లు తెలిసింది. వాప్కోస్ సంస్థకు డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ కింద ఇచ్చిన రూ.6.77 కోట్లను తిరిగి వసూలు చేయాలని కూడా కమిషన్ సూచించినట్లు సమాచారం. ఈ నేపథ%ి%్యంలో సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో తీసుకొనే నిర్ణయం కీలకం కానుంది. తదుపరి చర్యలకు సీఐడీకి ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతుంది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కె.ఐ.పి.సి.ఎల్) ద్వారా ఆర్థిక అవకతవకలు జరిగాయని పేర్కొన్న న్యాయ కమిషన్.. దీనికి బోర్డు సభ్యులు బాధ్యులని.. బోర్డులో ఉన్న నీటిపారుదల, ఆర్థికశాఖ అధికారులపై క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ కింద చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. కార్పొరేషన్ ఎండీగా ఉంటూ కేంద్ర జల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారని, బ్యారేజీల గురించి తనకు ఏమీ తెలియదని చెప్పారంటూ కాళేశ్వరం మాజీ ఈఎన్సీ హరిరాం గురించి కమిషన్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

**నిర్మాణ, పునరుద్ధరణ పనులు ఎల్ అండ్ టీ చేపట్టేనా?**

మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాకును పూర్తిగా తొలగించి మళ్లీ నిర్మించడంతో పాటు మిగిలిన బ్లాకుల పరిస్థితిని పరిశీలించేందుకు అవసరమైన పరీక్షలు చేయించాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫార్సు చేసింది. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ– పి.ఇ.ఎస్ జాయింట్ వెంచర్‌పై క్రిమినల్ చర్యలతో పాటు పునరుద్ధరణ పనులకయ్యే మొత్తాన్ని వసూలు చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫార్సు చేసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగినపుడు పునరుద్ధరణకయ్యే ఖర్చును తామే భరిస్తామని ప్రకటించిన నిర్మాణ సంస్థ తర్వాత ..తమకు సంబంధం లేదని పేర్కొంది. ఇప్పుడు కమిషన్ కూడా ఎల్ అండ్ టీని తప్పు పట్టింది. ఈ పనికి సంబంధించి ఎలాంటి సర్టిఫికెట్లు ఇవ్వరాదని, ఏడో బ్లాకును పునరుద్ధరించడంతో పాటు మిగిలిన లోపాలు సవరించడానికయ్యే వ్యయాన్ని కూడా సొంతంగా భరించాలని సిఫార్సు చేసింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో వచ్చే లోపాలను సరిదిద్దే బాధ్యత నిర్మాణ సంస్థలదేనని.. అన్నారం, సుందిళ్లలో కూడా నిర్మాణ సంస్థలు ఈ పని చేయాలని పేర్కొంది. అయితే గత ఆరునెలలుగా పునరుద్ధరణ, మరమ్మతులకయ్యే వ్యయంతో తమకు సంబంధం లేదని నీటిపారుదల శాఖకు పదే పదే లేఖలు రాసిన ఎల్ అండ్ టీ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సిఫార్సుతో ముందుకు వస్తుందా, రాకపోతే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# లోకేశ్ మాటలు పట్టించుకోం

-మొదటిపేజీ తరువాయి

బనకచర్లను వ్యతిరేకించాం'అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ వద్ద రామగుండం ఎత్తిపోతల పథకాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుదిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ ఆదివారం ప్రారంభించారు.

అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఏపీ మంత్రుల మాటలను పట్టుకొని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతున్నారని విమర్శించారు. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్తానని కేసీఆర్ గతంలో అన్నారని ఆయన గుర్తుచేశారు. గోదావరిలో రాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల నీటి వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రాజెక్టులు నిర్మిస్తామని తెలిపారు.

**తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని పునఃప్రారంభిస్తాం..**

గత ప్రభుత్వం దోపిడీ కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డలో నీరు నిల్వ చేస్తే దిగువన ఉన్న 44 ఊళ్లు, భద్రాచలం వరదలో కొట్టుకుపోతాయని జాతీయ డ్యామ్‌ల భద్రత ప్రాధికార సంస్థ నివేదిక



అందించిందని చెప్పారు. అందుకే మూడు బ్యారేజీల మరమ్మతులకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రూ. 38 వేల కోట్లతో ప్రాణహిత%–%చేవెళ్ల ప్రాజెక్టు కట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాళేశ్వరం ఉపయోగంలో లేకపోయినా రికార్డుస్థాయిలో వరి పండిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ అందించిన నివేదికను కేబినెట్ ముందు పెడతామని.. దీనిపై అసెంబ్లీ చర్చిస్తామని మంత్రి వెల్లడించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని

# ఈ నిరీక్షణ చూస్తే ఎన్ని రైళ్లు కావాలో?

హైదరాబాద్

కుటుంబంతో సహా గ్యాంగ్‌టక్ వెళ్లాలనుకున్న ధర్మరాజు రైలు టికెట్లకు ప్రయత్నిస్తే వెయిటింగ్ లిస్టు కనిపించింది. ప్రయాణానికి ఇంకా 20 రోజుల సమయం ఉంది కాబట్టి అప్పటివరకు కన్ఫర్మ్ అవుతుందని నమ్మకం పెట్టుకున్నారు. బయల్దేరాల్సిన రోజు రానే వచ్చింది.. కానీ టికెట్ కన్ఫర్మ్ కాలేదు. దాంతో ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ద.మ.రైల్వే జోన్‌లో గడిచిన మూడేళ్లలో ఏకంగా కోటి 9 లక్షల మంది టికెట్లు రద్దయ్యాయి. దీనిప్రకారం సగటున ఏడాదికి 36.3 లక్షల మంది రైలు ప్రయాణానికి దూరం అవుతున్నారు. ఈ లెక్కన ప్రయాణికుల ఇక్కట్లు తప్పాలంటే ఎన్నెన్ని రైళ్లు కావాలో రైల్వే శాఖ ఆలోచన చేయాలి.

**కొవిడ్ తర్వాత భారీగా ప్రయాణాలు**

కొవిడ్ తర్వాత ప్రజల్లో మార్పు వచ్చింది. ప్రకృతి పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లిరావడం బాగా పెరిగింది. ఇదే సమయంలో మరోపక్క విమాన టికెట్ల ధరలూ భారీగా పెరిగాయి. దీంతో ఎక్కువమంది రైలు ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. ఏ రైలును చూసినా సగటున నాలుగైదు వందలకుపైగా వెయిటింగ్ లిస్టు కనిపిస్తోంది. దీంతో చాలామంది బుకింగ్‌కు దూరంగా ఉంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాలు, పట్టణాల నుంచి.. సికింద్రాబాద్, విశాఖపట్నం, దిల్లీ, తిరుపతి, విజయవాడలకు రైళ్లు సరిపోవడం లేదు. పండగలు, వేసవి సెలవుల్లో ఈ సమస్య మరీ ఎక్కువ.

**వేగవంత రైళ్లకు డిమాండ్**




టికెట్ ధర ఎక్కువైనా వేగంగా ప్రయాణించే వందేభారత్, రాజధాని, దురంతో, శతాబ్ది వంటి రైళ్ల టికెట్లకు డిమాండ్ ఎక్కువుంటోంది. అన్నీ ఏసీ బోగీలైనా, సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య రెండు వందేభారత్‌లు ఉన్నా టికెట్లు వేగంగా అయిపోతున్నాయి.

**స్లీపర్, సెకండ్ సిటింగ్, ఛైర్‌కార్**

గడిచిన మూడేళ్లలో టికెట్‌లు కన్ఫర్మ్ కానివారు 1.09 కోట్ల మంది ఉండగా అందులో ఏకంగా 72.13 లక్షల మంది (66%) స్లీపర్ క్లాస్‌ల్లో బుక్ చేసుకున్నవారే. ఛైర్‌కార్ బోగీల్లో ఏడాదికి 1.15 లక్షల మందికి రిజర్వేషన్ దొరకట్లేదు. సెకండ్ సిటింగ్ ప్రయాణికులు సగటున ఏడాదికి నాలుగు లక్షల మంది ఉంటున్నారు.

**క్లోన్ రైళ్లు**

ఐదారొందల పైచిలుకు వెయిటింగ్‌లిస్టు ఉండే ప్రధాన రైళ్లకు... అదేరోజు, అదే రూట్‌లో క్లోన్ రైలు నడిపించాలి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కోచ్ ఫ్యాక్టరీల్లో బోగీల ఉత్పత్తి పెంచాలి. అప్పుడే ఈ సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడినట్లు.

## యూరియా కోత.. రైతన్న వెత

-మొదటిపేజీ తరువాయి

అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్రం నుంచి ఆ మేరకు యూరియా వస్తేనే గండం గట్టెక్కే అవకాశం ఉంటుందని, లేకపోతే రైతులు రోడ్లు ఎక్కే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రం వానాకాలం సీజన్‌కు గాను నెలల వారీగా కేటాయించిన 9.80 ఎల్ఎంటీల యూరియాలో కోత పెట్టడంతోనే రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా..రాష్ట్రానికి కోటాకు మించి ఎరువులు సరఫరా చేశామంటూ కేంద్ర మంత్రి చేసిన ప్రకటనతో గందరగోళం నెలకొంది. ఇది రైతులకు తప్పుడు సంకేతాలను ఇస్తుందని, గ్రామాల్లో యూరియా కోసం ఆందోళనలు పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర అధికారులు అంటున్నారు.

**చర్చనీయాంశమైన కేంద్రమంత్రి ప్రకటన**

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఉందని ప్రభుత్వం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి అనుప్రియా పటేల్ చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది. తెలంగాణకు ఈ ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో అవసరమైన 20.30 ఎల్ఎంటీల కన్నా అధికంగా 22.15 ఎల్ఎంటీలు సరఫరా చేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. దీంతో బిత్తరపోవడం రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వంతయ్యింది. వాస్తవానికి ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి.. యూరియాతో పాటు డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ ఎరువులు కలిపి 22.15 ఎల్ఎంటీ ఇచ్చినట్లు చెప్పాల్సిన కేంద్ర మంత్రి.. కేవలం యూరియానే 22.15 ఎల్ఎంటీ సరఫరా చేసినట్లుగా చెప్పారని ఓ అధికారి వివరించారు. నిజానికి ఇప్పటివరకు ఇచ్చిన యూరియా 4.50 ఎల్ఎంటీలు మాత్రమేనని చెప్పారు.

**అసలు లెక్కలేంటి?**

రాష్ట్రంలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. ఈ వానాకాలంలో ఏకంగా 134 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 10.48 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కానీ కేంద్రం ఈ సీజన్‌కు గాను నెలవారీగా 9.80 ఎల్ఎంటీలు మాత్రమే కేటాయించింది. అదేమంటే యాసంగి సీజన్‌లో మిగిలిన యూరియా 1.92 ఎల్ఎంటీ గోదాముల్లో ఉందని, దాన్ని వినియోగించుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సమాచారం మేరకు.. ఏప్రిల్ నుంచి జూలై వరకు కేంద్రం 6.60 ఎల్ఎంటీల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా 4.50 ఎల్ఎంటీలే వచ్చింది. అంటే 2.10 ఎల్ఎంటీ (32 శాతం) తక్కువగా వచ్చిందన్న మాట. దీనికి రాష్ట్రం వద్ద ప్రారంభ నిల్వ కింద ఉన్న యూరియా 1.92 ఎల్ఎంటీలు కలిపితే మొత్తం 6.42 ఎల్ఎంటీలు అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. ఇందులో సుమారు 5.20 ఎల్ఎంటీలు ఇప్పటికే రైతులకు విక్రయించగా.. 1.20 ఎల్ఎంటీల పైచిలుకు నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది.

**2 ఎల్ఎంటీలైనా వస్తేనే..**

ఈ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన 9.80 ఎల్ఎంటీలకు గాను జూలై వరకు 4.50 ఎల్ఎంటీలు సరఫరా చేసిన నేపథ్యంలో ఇంకా 5.30 ఎల్ఎంటీల యూరియా రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగు నెలల్లో కోత విధించిన 2.10 ఎల్ఎంటీలతో పాటు ఆగస్టు కోటా 1.70 ఎల్ఎంటీలు కలిపి ఈ నెలలో సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే కేంద్రాన్ని కోరారు. కాగా ఇటీవల కేంద్ర మంత్రి ప్రకటన నేపథ్యంలో అధికారులు సమావేశమై యూరియా కొరత పరిస్థితిని సమీక్షించారు. ఆగస్టులో కనీసం 2 ఎల్ఎంటీల యూరియా అయినా వస్తేనే ప్రస్తుతానికి గట్టెక్కే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మంత్రి తుమ్మల కూడా తాజాగా కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్‌కు లేఖ రాశారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపులు, ఇప్పటివరకు కేంద్రం నుంచి వాస్తవంగా వచ్చిన యూరియా వివరాలు తెలియజేశారు. రాష్ట్రంలో కొరతను దృష్టిలో పెట్టుకుని తక్షణమే అవసరమైన యూరియాను పంపించాలని విజ్ఞప్తి చేశారు.

## దక్షిణాదిన పోటాపోటీ

హైదరాబాద్

దేశంలోనే అభివృద్ధి పరంగా దక్షిణాది రాష్ట్రాలు దూసుకెళ్తున్నాయి. రాష్ట్రాల జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పరంగా ముందు వరుసలో కొనసాగుతున్నాయి. ఇప్పుడు 1 ట్రిలియన్ యూఎస్ డాలర్ల(సుమారు రూ.87లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకునేందుకు పోటీపడుతున్నాయి. ఇందుకు ఆయా రాష్ట్రాలకు ఉన్న అవకాశాలు, నిర్దేశించుకున్న లక్ష్యాలపై స్థిరాస్తి కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్ఈ–సీఐఐ ఇటీవల నివేదిక విడుదల చేసింది. సాంకేతికతపరంగా అధిక వృద్ధి, జీసీసీ(గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)ల ఏర్పాటు, ఈవీ వాహనాల తయారీ, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ రంగాల విస్తరణతో ఇవి ఆ దిశగా అడుగులు వేస్తున్నాయని పేర్కొంది. జీవశాస్త్రాల విస్తరణ, పర్యాటక రంగాల పరంగా విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపింది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాలు ఆ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు ఆలంబనగా నిలుస్తున్నాయి. ఈ నగరాల్లో ప్రపంచస్థాయి ప్రతిభ, మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో బలమైన వృద్ధి కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. దేశంలో ఏ రాష్ట్రం ట్రిలియన్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోలేదు. ఆ దిశగా మహారాష్ట్ర ముందంజలో ఉండగా ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్ పోటీపడుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలు ఏ సంవత్సరంలోగా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్దేశించుకున్నాయి.. ఏయే రంగాలను విస్తరించాలో నివేదికలో వివరించారు.

**ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా..**

'ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమ ప్రధాన చోదకశక్తిగా తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే లక్ష్యాన్ని కొనసాగిస్తుంది. కృత్రిమమేధ(ఏఐ), క్వాంటమ్ వంటి కొత్త సాంకేతికతల పరంగా తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చడం మా ముందున్న లక్ష్యం' అని రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ అన్నారు.

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గమని.. ఉప ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలువాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అధికారంలోకి వచ్చాక బస్తీల్లో ఉండే పేదల ఇండ్లు కూల్చుతున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్ కొడంగల్ నియోజకవర్గంలో ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు కట్టుకున్నాడని.. హైదరాబాద్‌లో రేవంత్, ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లోనే ఉందని.. ఇలా చెప్పుకుంటే పోతే కాంగ్రెస్ నేతల ఇండ్లన్నీ బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లోనే ఉన్నాయన్నారు. కూట్లో రాయి తెయ్యలేని వాడు, ఎట్లో రాయి తీస్తా అని రేవంత్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. మాగంటి గోపీనాథ్ చేసిన సేవలకు నివాళిగా, మరొక్కసారి జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. 20 నెలల కాంగ్రెస్ అసమర్థ, అవినీతి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వంటి నేతలంతా వచ్చి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మోసగాళ్లకు, మోసగాళ్ల పార్టీ అయిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని, రానున్న ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. 20 నెలల కాంగ్రెస్ మోసాన్ని చూసిన తర్వాత కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, అన్ని సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ గెలిచిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయని.. మళ్లీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేసినా, ఉన్న పథకాలన్నీ పోతాయన్నారు. కాంగ్రెస్ మోసానికి తెలంగాణ ప్రజలు అంగీకరించారని కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీల ఏకైక ఎజెండా తెలంగాణ రాష్ట్ర సమితిని ఓడించడమేనన్నారు.

# ఉత్తరప్రదేశ్‌లో వరదలు

**లఖ్‌నవూ**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. వందలాది గ్రామా లు, కొన్ని నగరాలు పూర్తిగా నీట మునిగాయి. జన జీవనం స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, సహాయక సిబ్బంది రంగంలోకి దిగి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాన్పూర్‌నగర్, లఖింపూర్ ఖేరీ, ఆగ్రా, ఔరారియా, చిత్రకూట్, బల్లియా, బండా, ఘాజీపూర్, మీర్జాపూర్, ప్రయాగ్‌రాజ్, వారాణసీ, చందౌలీ సహా 17 జిల్లాలను వరదలు ప్రభావితం చేశాయి. గంగా, యమునా, రామగంగా, గోమతి సహా పలు నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్, వారాణసీ నగరాలు పూర్తిగా నీట మునిగాయి. ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే 15 వేల ఇళ్లలోకి వరద నీరు చేరింది. పలు ప్రాంతాల్లో పీకల్లోతు వరద నీటిలో సురక్షిత ప్రాంతాలకు చేరేందుకు అక్కడి జనం పడుతున్న ఇబ్బందుల తాలుకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'వరదలతో 37 తహసీళ్లలోని 402 గ్రామాలకు చెందిన 84,392 మంది ప్రజలు ప్రభావితమయ్యారు.
47 వేలకు పైగా మందికి తక్షణ సాయం అందించాం. క్షేత్రస్థాయిలో సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. 493 పడవలు, బోట్ల ద్వారా ఆహారం ప్యాకెట్లు, అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తున్నాం' అని విపత్తు నిర్వహణ కమిషనర్ భానుచంద్ర గోస్వామి ఓ



ప్రకనటలో తెలిపారు. మంత్రి స్వతంత్రదేవ్ సింగ్ హమీర్‌పూర్‌లోని వర ద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. సహాయక శిబిరాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఇక రాబోయే 24 గంట ల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. వరదల నేపథ్యంలో సర్కారుపై ప్రతిపక్ష నేత, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టును బీజేపీ అపహాస్యం చేసిందని విమర్శించారు. 'ప్రయాగ్‌రాజ్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా అక్కడి ప్రజలకు వరద ముంపు కష్టాలు తప్పలేదు. బీజేపీ నేతల అవినీతిని అక్కడి నీటి గుంతలే స్పష్టం చేస్తున్నాయి. స్మార్ట్ సిటీ భావనపై నీళ్లు చల్లిన కాషాయ పార్టీ నేతలు తమ పడవల్లో ఎక్కడికో అదృశ్యమయ్యారు?' అంటూ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు.

# కాలువలో పడిన కారు.. 11 మంది మృతి

**గోండా**

ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సరయూ నది కాలువలో కారు పడిపోవడంతో అందులోని ఒకే కుటుంబానికి చెందిన 9 మంది సహా 11 మంది మృత్యువాతపడ్డారు. నలుగురు గాయాలపాలయ్యారు. వీరంతా ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి వెళ్తుండగా బెల్వా బహుతా గ్రామ సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితులంతా గోండా జిల్లా సిహాగావ్ గ్రామానికి చెందిన వారని ఇటియాథోక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో కృష్ణ గోపాల్ రాయ్ చెప్పారు. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్ సహా 15 మంది ఉన్నారన్నారు. గ్రామస్తులు, సహాయక బృందాల సాయంతో కాలువలో మునిగిన వాహనం నుంచి 11 మృతదేహాలను వెలికి తీసినట్లు ఆయన వివరించారు. వర్షం కురుస్తుండటంతో రోడ్డంతా జారుడుగా మారిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కాలువలో పడిపోయిందని తెలిపారు. వెంటనే పోలీసులకు తెలిపామన్నారు. తాడు సాయంతో వాహనాన్ని బయటకు లాగామన్నారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిహాగావ్‌లో మేవాలాల్ మాధ్యమిక పాఠశాల మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రహ్లాద్ కుటుంబంలోని 9 మంది ఉన్నట్లు చెప్పారు.

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**

ఆలయానికి వెళ్తున్న వారు ప్రమాదానికి గురి కావడంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులు రూ.50 వేల



చొప్పున సాయం అందజేస్తామని ప్రకటించారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఘటనపై స్పందించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తామని ఆదిత్యనాథ్ ప్రకటించారు. కాగా, మృతుల్లో ప్రహ్లాద్ భార్య బీనా, ఇద్దరు కుమార్తెలు కాజల్, రింకీ, ప్రహ్లాద్ సోదరుడు రాంకరణ్, ఆయన భార్య అనుసూయ, వీరి కుమార్తె సౌమ్య, కుమారుడు శుభ్, ప్రహ్లాద్ మరో సోదరుడు రాంరూప్, ఆయన భార్య నందిని, కుమారుడు అమిత్ ఉన్నారు. ప్రహ్లాద్ పొరుగింట్లో ఉండే రామలలన్ వర్మ భార్య సంజు, అతడి సోదరి అంజు కూడా చనిపోయిన వారిలో ఉన్నారు. ప్రహ్లాద్ కుమారుడు సత్యం, రామ్ లలన్ వర్మ, వాహనం డ్రైవర్ సీతారామన్ గాయపడ్డారు. వీరు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషాదం తెలిసిన సిహాగావ్ గ్రామస్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


# పెండింగ్.. పరిష్కారమయ్యేనా?

**హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో పెట్టిన జీవో 59 అమలు కోసం ఒత్తిడి పెరుగుతోంది. గత 20 నెలల కాలంగా తమ దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నాయని, వీలున్నంత త్వరలో నిర్ణయం తీసుకుని తాము నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల కారణంతో తమ దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టడం సమంజసం కాదంటూ మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు దరఖాస్తుదారులు వస్తున్నారని, మరోవైపు ముఖ్యమంత్రితో పాటు రెవెన్యూ శాఖ మంత్రిపై కూడా పలువురు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జీవో 59 ద్వారా ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో ఈ నెలలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని రెవెన్యూ అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. దరఖాస్తుదారులకు మరోమారు నోటీసులిచ్చి, అవసరాన్ని బట్టి ఆ భూములపై మరోమారు కూలంకషంగా విచారణ జరిపి అర్హులకు క్రమబద్ధీకరించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఆ శాఖ వర్గాలంటున్నాయి.

**కేబినెట్ సబ్ కమిటీకి ఇప్పటికే నివేదిక**

ఆదాయ వనరుల సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి గతంలోనే రెవెన్యూ శాఖ జీవో 59కి సంబంధించిన నివేదికను




సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. జీవో 59 కింద మొత్తం 57,661 దరఖాస్తులు రాగా, 55,997 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే 32,788 దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు కూడా జారీ చేశారు.
వీరిలో 13,726 మంది డిమాండ్ మేరకు ప్రభుత్వానికి చెల్లింపులు చేశారు. దీంతో 10,553 మంది కన్వేయన్స్ డీడ్‌లు కూడా మంజూరు చేశారు. మిగిలిన దరఖాస్తుల్లో 828 దరఖాస్తులు అధిక విలువ ఉన్న భూములకు సంబంధించినవని, సాధారణ విలువ ఉన్న పెండింగ్ దరఖాస్తుల ద్వారా దాదాపు రూ.1,000 కోట్లు ప్రభుత్వానికి సమకూరుతుందని, అధిక విలువ గల భూములను కూడా క్రమబద్ధీకరిస్తే మరో రూ.5 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే కన్వేయన్స్ డీడ్స్ వచ్చినప్పటికీ సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో జీవో 59 క్రమబద్ధీకరణ భూములపై లావాదేవీలు నిర్వహించవద్దని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిశీలన పూర్తయిన దరఖాస్తులు, మార్కెట్ విలువ చెల్లించినవి, డీడ్స్ జారీ అయి కూడా పెండింగ్‌లో ఉన్నవి, అధిక విలువ కలిగిన భూములు... ఇలా పలు దశల్లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించే దిశలో త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది.

## రిజిస్టర్డ్ పోస్ట్ ఇక కనుమరుగు

**న్యూఢిల్లీ**

కోట్లాది మందికి చిరపరిచితమైన పోస్టల్‌శాఖ వారి 'రిజిస్టర్డ్ పోస్ట్' ఇక కనుమరుగు కానుంది. దేశవ్యాప్తంగా గత 50 సంవత్సరా లుగా కీలకమైన సర్టిఫికేట్లు, ఉద్యోగ నియామక పత్రాలు, లీగల్ నోటీసులు, ప్రభుత్వ ఉత్తర్వులను రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ప్రజలకు చేరవేసిన పోస్టల్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 'రిజిస్టర్డ్ పోస్ట్' సేవలను కొనసాగించబోమని 'ది ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్' ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ఇన్నాళ్లూ అందించిన సేవలనే స్పీడ్‌పోస్ట్ లేదంటే ఇతర సేవల్లో భాగంగా అందించనున్నట్లు తెలుస్తోంది. కేవలం ఆ పేరు మాత్రమే ఇకపై వినియోగించబోరని పోస్టల్‌శాఖ వర్గాలు తెలిపాయి. తక్కువ ఖర్చులో, అత్యంత విశ్వసనీ యమైన, అత్యంత అనువైన తపాలా సేవగా గత యాభై ఏళు ్లగా రిజిస్టర్డ్ పోస్ట్ జనం మదిలో నిలిచిపోయింది. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగ అపాయింట్‌మెంట్ లెటర్ వచ్చిందంటే అది దాదాపు రిజిస్టర్డ్ పోస్ట్‌లో రావాల్సిందే. ఉత్తరప్రత్యుత్తరాల కాలంలో రిజిస్టర్డ్ పోస్ట్‌కు ఎనలేని విలువ ఉండేది. 2011%–%12 కాలంలో దేశవ్యాప్తంగా 24.44 కోట్ల రిజిస్టర్డ్ పోస్ట్‌లను తపాలా శాఖ పంపించగా 2019%–%20 కాలానికి వచ్చేసరికి కేవలం 18.46 కోట్ల రిజిస్టర్డ్ పోస్ట్‌లే పంపించగల్గింది. అంటే ఏకంగా 25 శాతం రిజిస్టర్డ్ పోస్ట్‌లు తగ్గిపోయాయి. వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ కీలకమైన పీడీఎఫ్, ఇతర ఫైళ్లు, పత్రాలను పౌరులు నేరుగా సెకన్ల వ్యవధిలో పంపే సంస్కృతి పెరగడంతో రిజిస్టర్డ్ పోస్ట్‌కు ఆదరణ తగ్గిపోయిందని తెలుస్తోంది.

## ఈసీది అధికార దుర్వినియోగం

**ఢిల్లీ**

ఎన్నికల సంఘం(ఈసీ)పై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో ఓటర్ల జాబితాపై చేస్తున్న ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)తో ఈసీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రాల ఎన్నికల స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. "బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారు. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది చట్టవిరుద్ధం. ఆందోళన కలిగించే విషయం" అని చిదంబరం ఆందోళన వ్యక్తంచేశారు. అయితే చిదంబరం వ్యాఖ్యలను నిరాధారమైనవిగా, తప్పుదోవ పట్టించేవిగా ఈసీ పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం– 1950లోని సెక్షన్ 19(బీ) ప్రకారం.. ఒక నియోజకవర్గంలో నివసిస్తున్న వ్యక్తి స్థానిక ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి దిల్లీలో నివసిస్తున్నట్లయితే.. దిల్లీలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. అలాగే బిహార్‌కు చెందిన వ్యక్తి చెన్నైలో ఉంటే.. అదే విధానం వర్తిస్తుందని తెలిపింది. ఈ నేపథ్యంలో.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నేతలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం తగదని ఈసీ పేర్కొంది. ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. అదేవిధంగా.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్ల నమోదు గురించి తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పింది. ఆ రాష్ట్రంలో ఇంకా ఓటర్ల జాబితా సవరణ చేపట్టలేదని.. కాబట్టి బిహార్‌లోని ఎస్ఆఐర్ ప్రక్రియతో ముడిపెట్టడం అసంబద్ధమని స్పష్టం చేసింది.

## దేశాధినేతతో ప్రభుత్వాధినేత భేటీ ఆంతర్యమేమిటో!

**ఢిల్లీ**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా గంటల వ్యవధిలో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ వరుస భేటీల వెనక కారణాలు తెలియరాలేదు. దీనిపై ప్రధాని కార్యాలయం ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. అమిత్‌షా మాత్రం రాష్ట్రపతితో తన సమావేశానికి సంబంధించిన ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేశారు. బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని మోదీ కలవడం ఇదే తొలిసారి. బిహార్ ఓటర్ల జాబితాపై జరుగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణపై ప్రత్యేక చర్చ కోసం పార్లమెంటులో విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అటు ప్రధాని.. ఇటు హెూంమంత్రి రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సభలు సజావుగా సాగేనా..**

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి ఇంతవరకు ఉభయసభల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభన సోమవారం తర్వాతైనా వీడిపోతుందనే ఉద్దేశంతో కొన్ని బిల్లుల్ని ముందుకు తీసుకువెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. క్రీడాసంస్థల పనితీరులో పారదర్శకతకు ఉద్దేశించిన 'జాతీయ క్రీడా పాలన బిల్లు'ను లోక్‌సభ ఆమోదానికి ప్రవేశపెట్టనున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై రెండ్రోజులు జరిగిన ప్రత్యేక చర్చ తప్పిస్తే మిగతా రోజులన్నీ బిహార్ ఓటర్ల జాబితా అంశంతో కొట్టుకుపోయాయి. విపక్షం తన పట్టు సడలించకపోతే గందరగోళం నడుమే బిల్లుల్ని ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించనుంది. ఓటర్ల జాబితా అంశంపై నిరసన వ్యక్తం చేయడానికి ఈ నెల 8న ర్యాలీ నిర్వహణకు విపక్షాలు యోచిస్తున్నాయి. రాహుల్ 7వ తేదీ రాత్రి విపక్ష నేతలకు విందు ఇవ్వనున్నట్లు తెలిసింది.

## త్వరలో ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు సేవలు

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

**భావ్ నగర్**



దేశంలోని తొలి బుల్లెట్ రైలు సేవలు త్వరలో ప్రారంభం అవుతాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. దీంతో అహ్మదాబాద్ నుంచి ముంబైకి కేవలం రెండు గంటల ఏడు నిమిషాల్లో చేరుకోవచ్చని ఆయన తెలిపారు. అయోధ్య ఎక్స్‌ప్రెస్, రేవా%–%పుణే ఎక్స్‌ప్రెస్, జబల్‌పూర్%–%రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఆదివారం భావ్‌నగర్ టెర్మినస్‌లో వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ముంబై%–%అహ్మదాబాద్ తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. దేశంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు ముంబై%–%అహ్మదాబాద్ మధ్య 508 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుంది. ఇది ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నుంచి ప్రారంభమై, గుజరాత్‌లోని వాపి, సూరత్, ఆనంద్, వడోదర గుండా అహ్మదాబాద్‌కు వెళ్తుంది. గంటకు 320 కి.మీ. వేగంతో నడవనుంది. ఈ సందర్భంగా మంత్రి పలు రాష్ట్రాల్లోని రైల్వే ప్రాజక్టుల గురించి పంచుకున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా అనేక కొత్త ప్రాజెక్టులు చేపట్టనున్నట్టు తెలిపారు. రెండు రాష్ట్రాల్లోని డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ప్రాజెక్టులను వేగంగా అభివృద్ధి చేస్తున్నాయన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లలో 34వేల కి.మీ.ల కొత్త రైల్వే ట్రాక్‌లను వేసింది, దేశంలో రోజుకు దాదాపు 12 కి.మీ కొత్త ట్రాక్‌లను నిర్మించిందని చెప్పారు. దేశంలో 1,300 రైల్వే స్టేషన్లను పునరుద్ధరిస్తున్నామని, ఇది ఇంతకుముందెప్పుడూ చేయని పనని ఆయన కొనియాడారు. ఈ క్రమంలో వస్తున్న సవాళ్లన్నింటినీ పరిగణనలోకి తీసుకుని దార్శనికతతో ప్రధాని మోదీ స్టేషన్ల పునరుద్ధరణ చేయిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఎనిమిది అమృత్ భారత్ రైళ్లు ప్రారంభించామని, వాటిలోనూ వందే భారత్‌వంటి సౌకర్యాలు కల్పించామని, అయినా ఛార్జీలు మాత్రమే తక్కువగానే ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఈ రైళ్లను కొత్త తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్మించారని, వీటిలో ప్రయాణిస్తున్న వారు గొప్ప భావోద్వేగాలకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు.

# సహస్ర వృత్తుల సమస్త చిత్రం

తలచుకోగానే ఎవరైనా కళ్లబడితే వారికి 'నిండు నూరేళ్ళు' అంటాం. అట్లా కాపు రాజయ్యకి నిండు ఆయుర్దాయం నేటికి నిండినదేమీ కాదు, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనే వారి యాది సంపూర్ణం. శతాయువు మాత్రమే కాదు, వారు అనునిత్యం చిరంజీవి. అయితే ఇక ముందు వారి మరో అంకం సాగనుంది. అదే ఈ వ్యాసం సారాంశం. ఎవరైతే తమ గడుల్లో బలవంతంగా బతుకమ్మ ఆడించారో వారే బతుకమ్మ ఆడే స్థితి తెలంగాణ ఉద్యమం తేనే తెచ్చింది. వాళ్ళ మెడలు వంచి బతుకమ్మను, బోనాలను నెత్తిమీద పెట్టుకునేలా చేయనే చేసింది. అంతేకాదు, సకల జనుల సమిష్టి చేతనలోకి మన సాంస్కృతిక ఆనవాళ్ళు బలీయమై, ఉద్యమ ?సోయిలోకి వచ్చేసరికి మళ్ళీ సజీవ స్మృతిలోకి వచ్చి చేరిన రెండే రెండు బొమ్మలు, రాజయ్య గీసినవే. ఒకటి%-% సద్దుల బతుకమ్మ, రెండు%-% బోనాలు, ఈ రెండు బొమ్మలు రాష్ట్ర పండుగలుగా అయ్యేనాటికి ఎంతో ముందు, అనేక దశాబ్దాల క్రితమే వారు ఆ ఉత్సవాలను అపురూపంగా పదిలపరిచారు. చిత్రమేమిటంటే, 'ఫక్తు రాజకీయాల దశ' పోయి 'ప్రజా పాలన' అని మూడో దఫా ప్రభుత్వం వచ్చేనాటికి తెలంగాణ తల్లి చేతుల్లో బతుకమ్మ మాయం అయి ఉండొచ్చు గాక. కానీ, ఆయన చేసిన పని అంతకుముందే పరిసమాప్తి అయింది. అవును, వారు చిత్రించి పెట్టిన ఆ రెండు బొమ్మలు చేయవలసిన పని చేశాయి. ఇప్పుడు మిగితావి కూడా బయలుపడతాయి. అదే శత జయంతి ఆన. హైదరాబాద్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కాపు రాజయ్య శత జయంతి ఉత్సవ సందర్భంగా కళా ప్రదర్శన ప్రారంభం. ఆగస్టు పది వరకూ ఉంటుంది. ఈ ప్రదర్శనలో బహుశా అనేక చిత్రాలు నూతన అంకురానికి ప్రేరేపణ ఇస్తాయనే నమ్ముతాను నేను. అవును, రాజయ్య సబ్బండ వర్ణాల చిత్రకారులు. వారు పండుగలు, పబ్బాలను మాత్రమే చిత్రించలేదు. నేడు బీసీ కుల గణన ద్వారా మొదటిసారిగా దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రజగణన జరిగే తరుణం ఆసన్నమయ్యే సరికి వారు అసలైన ఉత్సవ రథాన్ని మన ముందుకు చేర్చనే చేర్చారు. ఆయన తీరొక్క కులాన్ని, వారి వ్యావృత్తులతో కూడి, కడు సుందరంగా ఎప్పుడో చిత్రించి ఉన్నారు. ఇకముందు వారి అన్ని చిత్రాలూ ఊరేగక మానవు. వెలికి తీయవలసిన సందర్భం ఇది. ఒక్క మాటలో భారతదేశ చిత్రకళా మండలంలోకి ఒకనాడు పరిపుష్టంగా తులతూగిన తెలంగాణ గ్రామాన్ని, అందలి మెజారిటీ కుల సముదాయాలను కాపు రాజయ్య ప్రతిక్షేపించి చూపినంత ఘనంగా మరొకరు చేయలేదు. వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలను ఉపరితల మానకంగా వేయలేదు. ఆయా వృత్తిదారులను వారి పనిపాటలే రక్తమాంసాలతో తమవైన అచ్చట్లు ముచ్చట్లతో తమవైన అలంకారాలతో ఒక కోలాటంగా చిత్రించి పెట్టారు. నేడు వాటిని చూడటం అంటే వాంఛితంగా నైరూప్యం చేసిన మెజారిటీ ప్రజల గ్రామీణ జీవన ఉత్సవాన్ని తిరిగి వాస్తవికంగా దర్శించడమే. అదే ఇప్పటి కవి సమయం లేదా చిత్రకళా పునరుజ్జీవన సందర్భం. అనేకులకు వారి బతుకమ్మ, బోనాలతో పాటు రాజయ్య గీసిన రాధాకృష్ణుల చిత్రం తెలుసు. చాలామందికి తాటి చెట్టు ఎక్కుతున్న గౌడ్ తాలూకు 'రిస్కీ లైఫ్' తెలుసు. కానీ, వారి కాన్వాసు పెద్దది. అందులో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, బెస్త,






స్వర్ణకారి, మేదరి, పద్మశాలీ, వడ్డెరలు, నకాషీలే కాదు, యాదవులు, దూదేకులు, రజకులు ఎందరో ఉన్నారు. పరమాత్మ, జీవాత్మలతో సహా ఇంకా ఎన్నో చిత్రించారు. నిజానికి వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నంగా చూపింది 'కళ'ను. అవును. కళే ఒక్కో కులానికి ఉన్న బహుజన ప్రజల అసలైన విద్యా ఉద్యోగ ఔపాధిక సంస్కృతి అని, అదే స్వరాజ్యం అని ఆయన చిత్రించారు. అదే రాజయ్య రాజరికం. నిజానికి బహుజన సమాజాన్ని, ఒక్కో సముదాయంగా తరతరాలుగా వారు చేపట్టి అభివృద్ధి చేసిన పనులను 'వృత్తులు' అనే చాలా మంది భావించారు. వాటిని 'హస్తకళలు' అనే మాట్లాడారు. కానీ రాజయ్య తన లలిత కళలో ఒక్కో కులాన్ని గొప్ప జీవకళగా అభివ్యక్తం చేసి చూపారు. ఒకరి చేతుల్లో ఒకరు చేయుంచి ఊరు ఉమ్మడిగా సకల కులాల సమ్మేళనంగా, తీరొక్క మనుషుల సమిష్టి జీవన గ్రామంగా ఆయన దేనికదే ఒక బొమ్మగా చిత్రించి పెట్టారు. అదే వారి 'కళా భవనం'. మరో మాటలో ఆయన గ్రామాన్ని తన జానపద చిత్తమూ చిత్రంతో పల్లకీ ఎక్కేలా చేశారు. ఆ బోయలే అందులో ఊరేగేలా చిత్రించారు. ధ్వంసం కాకముందరి గ్రామాన్ని, మనం కోల్పోయిన గ్రామ పునాదిని, అందలి నాగరికతలను వారు చూపినంత విశిష్టంగా ఇంతటి వైవిధ్యంతో దేశంలోనే మరే చిత్రకారుడూ చిత్రించలేదు. అందువల్లే రాజయ్య శత జయంతి ఉత్సవం ఒక్క తెలంగాణకు, తెలుగు రాష్టాలకు పరిమితం కారాదు, దేశంలోని బహుళ ప్రజానీకపు బతుకులకు ఈ వేడుక పునరుజ్జీవన కానుక. ఒక ఎరుక. గణన. అందుకే సరికొత్తగా అనడం, వారి కళ సహస్ర వృత్తుల సమస్త చిహ్నం అని. అది ఒకనాడు కేవలం బతుకమ్మ బొమ్మగానే కానవచ్చింది. కానీ నేడు వారి శత జయంతి సమయానికి, ఒక్కో కులానికి చెందిన వారి బొమ్మలన్నీ తీరొక్క పూల వంటి ఒక సాంస్కృతిక సమ్మేళనంగా, ఒక గణనీయమైన వైవిధ్యంగా మన ముందుకు వచ్చాయని. అదే దేనికదే నిజమైన 'బతుకమ్మ'. విభిన్న పండుగగా చూడాలి. ఇక వారి ఒక్కో బొమ్మను లెక్కించి చూడాలి. అదే వారికి మనమిచ్చే ఘనమైన నీరాజనం

# ఫిరాయింపుల జాడ్యం ఆగేనా?!

చట్టాలు కాగితాలకూ... ఆదర్శాలు ఉపన్యాసాలకూ పరిమితమవుతూ రాజ్యాంగ విలువలకు గ్రహణం పడుతున్న వేళ సర్వోన్నత న్యాయస్థానం ఒక విలువైన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ తెలంగాణ శాసనసభ స్పీకర్‌ను ఆదేశించింది. అదే సమయంలో అటువంటి ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని తెలియజేసింది. పదో షెడ్యూల్ 6(1) పేరా చెప్తున్నదాని ప్రకారం ఇలాంటి అంశాలపై నిర్ణయం తీసుకునేటప్పుడు స్పీకర్ ఒక ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నట్టేనని, అందువల్ల రాజ్యాంగ అధికరణలు 226, 227 ప్రకారం హైకోర్టులూ, 136 అధికరణ ప్రకారం సుప్రీంకోర్టూ స్పీకర్ చర్యల్ని సమీక్షించవచ్చని ధర్మాసనం చెప్పటం విశేషం. ఈ విషయంలో 122, 212 అధికరణల కింద స్పీకర్లకు రాజ్యాంగపరమైన రక్షణ ఉండబోదని కూడా తేల్చింది.

అసెంబ్లీలు మొదలుకొని పార్లమెంటు వరకూ ఫిరాయింపుల జాడ్యం ఇటీవలి కాలంలో బాగా ముదిరింది. కమ్యూనిస్టులు, వైఎస్సార్ కాంగ్రెస్ వంటి ఒకటి రెండు పక్షాలూ తప్ప ఈ జాడ్యానికి దూరంగా ఉన్న పార్టీలు అతి స్వల్పం. స్వల్ప మెజారిటీతో గద్దెకెక్కినా, సంఖ్యాబలానికి అంతో ఇంతో తక్కువున్నా ఫిరాయింపుల్ని ప్రోత్సహించటం అలవాటైపోయింది. రాజీవ్ గాంధీ ప్రధానిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 52వ రాజ్యాంగ సవరణ ద్వారా 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకొచ్చింది. అయితే ఆచరణలో అది ప్రభావవంతంగా లేదని గ్రహించి 2003లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉండగా 91వ రాజ్యాంగ సవరణ ద్వారా దాన్ని పటిష్ఠపరిచారు. చిత్రమేమంటే దేశంలో మూడొంతుల ముప్పాతిక ఫిరాయింపులకు ఈ రెండు పార్టీలే కారణం. అందుకు మణిపూర్ మొదలుకొని కర్ణాటక, మహారాష్ట్రల వరకూ ఎన్నయినా ఉదాహరణలు చూపించొచ్చు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన కేసు తెలంగాణలో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యే లకు సంబంధించింది. ఆ ఫిరాయింపుల్ని సవాలు చేసిన బీఆర్ఎస్, అధికారంలో ఉండగా తానూ అదే పని చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ దిగజారుడు తనాన్ని ప్రోత్సహించటంలో ఆరితేరినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయాక తెలంగాణలో తన పార్టీ తరఫున నెగ్గినవారిని పార్టీలో చేర్చుకుని మంత్రి పదవులిచ్చారని ఆవేశంతో రెచ్చిపోయి మాట్లాడిన బాబు... ఒకటి రెండు నెలలయ్యేసరికి ఏపీలో తానూ అదే పని నిస్సిగ్గుగా చేశారు.



అప్పట్లో వైఎస్సార్ కాంగ్రెస్ తరఫున నెగ్గిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి వారిలో నలుగురికి మంత్రి పదవులు కట్టబెట్టారు. ఈమధ్య వైఎస్సార్ కాంగ్రె స్‌కు చెందిన రాజ్యసభ, శాసనమండలి సభ్యులు కొందరిని లోబర్చుకుని పార్టీకీ, చట్ట సభల సభ్యత్వానికీ రాజీనామా చేయించారు. విలువల గురించి అతిగా మాట్లాడే అలవాటున్న బీజేపీ ఇందుకు తోడ్పడటమేకాక... తానూ లాభపడింది. ఏపీ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్ సంస్థల్లో ప్రజాస్వామ్యం ఎలా ఖూనీ అవుతున్నదో అందరూ గమనిస్తూనే ఉన్నారు. చట్టసభలను కేవలం శాసనాలు చేసే వేదికలుగా మాత్రమే పరిగణించటం సరికాదు. అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు, వారి ఆకాంక్షలు ఆ చట్టసభల పనితీరులో ప్రతిఫలించాలి. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శప్రాయులుగా ఉండాలి. అధికారం వచ్చింది మొదలు ప్రతిపక్షాన్ని బలహీనపరచటం ఎలా, కక్ష తీర్చుకోవటం ఎలా అనే అంశాలే నిత్యకృత్యమైతే అందువల్ల అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుంది. ఈ విషయంలో సభాధ్య క్షుల పాత్ర ఎంతో కీలకమైనది. వారు తటస్థంగా, సమర్థంగా వ్యవహరిస్తే చాలావరకూ ఈ జాడ్యం పోతుంది. చట్టసభల ఔన్నత్యం పెరుగుతుంది. చాలా సందర్భాల్లో వారు పాలకపక్షాలకు అనుకూలంగానే వ్యవహరిస్తున్నారు. పార్లమెంటు మొదలుకొని అసెంబ్లీల వరకూ సమా వేశాల ప్రత్యక్ష ప్రసారాలు అందుబాటులో కొచ్చాయి గనుక ఇప్పుడేదీ రహస్యం కాదు. అధ్యక్ష స్థానంలో ఉన్నవారి వ్యవహార శైలి ఎలా ఉంటున్నదో అందరూ ఆ క్షణంలోనే పసిగడుతున్నారు. సభాధ్యక్షులు తలుచుకుంటే ఫిరాయింపుల సమస్య పరిష్కారం పెద్ద కష్టం కాదు. కానీ అది సజావుగా సాగటం లేదు. 2014లో తమ పార్టీ నుంచి ఫిరాయించినవారిపై అటు లోక్‌సభ లోనూ, ఇటు అసెంబ్లీలోనూ వైఎస్సార్ కాంగ్రెస్ ఫిర్యాదు చేస్తే రెండు చోట్లా స్పందన ఒకేలా ఉంది. ఆ చట్టసభల గడువు ముగిసే సమయానికి కూడా స్పీకర్లు నిర్ణయం ప్రకటించలేక పోయారు. ఇలాంటి పరిస్థితులు న్నప్పుడు రాజ్యాంగ న్యాయస్థానాలు కళ్లు మూసుకుని ఉండ గలవా? ఫిరాయింపుదార్లపై చర్య తీసుకునే విషయంలో స్పీకర్లకున్న నిర్ణయాధికారాన్ని పార్లమెంటు సమీక్షిస్తే మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. కానీ ఆ చట్టంలోని లొసుగులతో అందరూ లాభపడుతున్నప్పుడు దీన్ని ఆశించటం అత్యాశేనేమో!

# సుంకాలు... శాపనార్థాలు!

రాక తప్పదనుకుంటున్న ముప్పు ముంగిట్లోకొచ్చింది. అమెరికా అధ్యక్షపీఠం అధిష్ఠించింది మొదలు నిలకడలేనితనంతో, పొంతనలేని వ్యాఖ్యలతో మిత్రుల్ని, వ్యతిరేకుల్ని కూడా సమానంగా ఇరకాటంలో పడేస్తున్న డోనాల్డ్ ట్రంప్... గతంలో హెచ్చరించినట్టే సుంకాల మోత మోగించారు. శుక్రవారం నుంచి భారత్ నుంచి వచ్చే సరుకులపై 25 శాతం సుంకాలు విధిస్తామని, ఇవిగాక రష్యా నుంచి ముడిచమురు, రక్షణ సామగ్రి కొంటున్నందుకు అదనంగా జరి మానా ఉంటుందని ప్రకటించారు. అది ఎంత శాతమో చెప్పకపోయినా రష్యాతో వాణిజ్యం సాగించే భారత్, చైనాలపై 500 శాతం వరకూ అదనపు సుంకాలుంటాయని ఆయన లోగడ ప్రకటించారు. కనుక ఈ సుంకాల కన్నా జరిమానా వాటాయే ఎక్కువుంటుందని అంచనా వేయొచ్చు. తన ఆదేశాలను ఔదలదాల్చనందుకు మన ఆర్థిక వ్యవస్థను 'మృత ఆర్థిక వ్యవస్థ'గా దూషించారు. అనాల్సిన వన్నీ అన్నాక 'ఇంకా భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చూద్దాం' అని ముక్తాయించారు. ఆయన హుకుం అమలైతే వస్త్రాలు, రొయ్యలు, ఆభర ణాలు, వజ్రాలు, తోలు ఉత్పత్తులు వగైరాలపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, ఆ రంగాల్లో ఉపాధి దెబ్బతింటుందనీ నిపుణుల అంచనా. ఈ రంగాల్లో 8,700 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులుంటున్నాయి. ఈ ఏడాది జీడీపీ 6.5 శాతానికి మించి వుండొచ్చని అంచనాలున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో అది బాగా తగ్గవచ్చంటున్నారు. ట్రంప్‌కు దౌత్య మర్యాదల సంగతి అటుంచి వ్యక్తిగా ఎలా మెలగాలో కూడా తెలియదు. బహిరంగ బెదిరింపులకు దిగటం, అన్యాయమని అందరికీ తెలిసేలా ప్రవర్తించటం ఆయన నైజం. బ్రెజిల్ సంగతే తీసుకుంటే అక్కడ ఆ మధ్య అధికారం కోల్పోయిన బోల్సొనారో ఆయ నకు ఇష్టుడు. కనుక అతనిపైవున్న నేరారోపణలు ఉపసంహరించి వదిలేయమని తాఖీదు పంపారు. అంగీకరించనందుకు అదనపు సుంకాలు విధించారు. దేశాలకు సార్వభౌమత్వం ఉంటుందనీ, దానికి లోబడి సంబంధాలు నెరపాలనీ ఆయన భావించరు. వాణిజ్య ఒప్పందాలు సాకారం కావాలంటే వాటిని కుదుర్చుకోదల్చుకున్న రెండు పక్షాలకూ పరస్పర విశ్వాసం, నమ్మకం ఉండాలి. ఓపిగ్గా చర్చించాలి. బ్రిటన్‌తో మనకు ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే ఇందుకు ఉదాహరణ. దాదాపు మూడేళ్లపాటు ఆ ఒప్పందంపై చర్చలు సాగాయి. ఒప్పందం అన్నాక ఇచ్చిపుచ్చుకోవడా లుంటాయి. 'మేం పుచ్చుకుంటాం... ఇవ్వం' అంటున్నారు. 'మాతో ఒప్పందానికి భారత్ సుముఖంగా వుంది... ఇక సంతకాలే తరువాయి' అంటూ చాన్నాళ్ల క్రితమే మన ప్రభుత్వం తరఫున తానే ప్రకటించారు. ట్రంప్ ఆగ్రహావేశాలకు వేరే కారణాలున్నాయి. మన సాగు, పాడి రంగాలను పరిరక్షించేందుకు అమెరికా నుంచి వచ్చే ఆ ఉత్పత్తులపై మన దేశం అధిక సుంకాలు విధిస్తోంది. ఇందులో సహేతుకత ఉంది. అమెరికాలో ఆ రంగాలకు భారీ సబ్సిడీలుంటాయి. దాంతో తమ ఉత్పత్తుల్ని వేరే దేశాల్లో కారుచౌకగా అమ్ముకోవటానికి వీలుంటుంది. అమెరికాతో పోలిస్తే మన సబ్సిడీలు చాలా తక్కువ. అవి రైతులకు లాభదాయకం కాకపోగా, ఆ రెండు రంగాల్లోనూ వ్యయం విపరీ తంగా పెరిగింది. రైతులు అధిక వడ్డీకి బయట అప్పులు చే యాల్సి వస్తోంది. తీరా గిట్టుబాటు ధర లభించక, అప్పులు తీరక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ట్రంప్ ఒత్తిడి చేస్తున్నట్టు అధిక సుంకాలు తొలగిస్తే ఈ సంక్షోభం మరింత పెరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆసరాగా ఉన్న ఆ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చేరినప్పుడే మన పాలకులు నిక్కచ్చిగా ఉండాల్సింది. కానీ దాటవేత ధోరణి ప్రదర్శించారు. రష్యాతో వాణిజ్యంపైనా ఇంతే. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలన్నట్టు ఉంటే వేరుగా ఉండేది. కానీ మన దేశం వారి ఆదేశాలు పాటించింది. 2009%-%13 మధ్య మన ఆయుధ కొనుగోళ్లలో రష్యా వాటా 76 శాతం. అదిప్పుడు 36 శాతానికి పడిపోయింది. దీన్ని ఆపేయాలని, తన ఎఫ్%-%35 యుద్ధ విమానాలు, ఎంక్యూ%-%9బి డ్రోన్లు, పీ%-%81 సాగర ప్రాంత గస్తీ విమానాలు కొనితీరాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. నిజానికి భారత్‌కు ఆయుధ అమ్మకాలపై 1960 ప్రాంతాల్లో అమెరికా నిషేధం విధించబట్టే రష్యాపై ఆధారపడటం పెరిగింది. ముడి చమురు విషయానికొస్తే మొన్న ఫిబ్రవరికి రష్యా నుంచి కొనుగోళ్లు 25 శాతం మేర పడిపోయాయి. అదే సమయంలో అమెరికా నుంచి కొనుగోళ్లు వంద శాతం పెరిగాయి. తన అంధభక్త గణాన్ని సంతృప్తిపరచటం కోసం, ఓటుబ్యాంకు పెంచుకోవటం కోసం ట్రంప్ దశాబ్దాల తరబడి ఎంతో ఓపిగ్గా నిర్మించుకుంటూ వచ్చిన ఇరు దేశాల సంబంధాలపైనా గొడ్డలి వేటు వేశారు. దీని పర్యవ సానాలు మనపై ఉన్నట్టే, అమెరికాపైనా ఉంటాయి. ఆయన ధోరణి మారకపోతే మన ఆర్థిక వ్యవస్థ మాటేమోగానీ... అమెరికా ఆర్థిక వ్యవస్థ 'మృతప్రాయం' కావటం ఖాయం.

ప్రభాత సూర్య
తెలుగు జాతీయ దిన పత్రిక



# పర్యావరణ పరిరక్షణలో బాగంగా మొక్కలు నాటిన కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి ప్రభాత సూర్య .. మియాపూర్ డివిజన్ నడిగడ్డ తాండ లో డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గడిచిన 11 సంవత్సరాల లో తెలంగాణ రాష్ట్రానికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇండ్ల నిర్మాణం, రైతులకు ఆర్థిక సహాయాల గురించి అంతేకాకుండా రహదారుల నిర్మాణం, విద్యుత్ సరఫరా మెరుగుదల, రైల్వే అభివృద్ధి , అటల్ పెన్షన్ యోజన , ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా , ప్రధానమంత్రి కిసాన్ సమాన్ నిధి ,బేటి బచావో బేటి పడావో , సుకన్య సమృద్ధి యోజన ,ఆయుష్మాన్ భారత్ వంటి మౌలింగా సదుపాయాల గురించి ప్రజలందరూ అవగాహన చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కేంద్ర ప్రభుత్వం నాయకులను కోరుతున్నానని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత కావున రాష్ట్ర పార్టీ సూచన మేరకు ప్రతి ఒక్కరూ తమ తమ బూత్ లలో అమ్మ పేరుతో చెట్టు నాటి కేంద్ర ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కరపత్రాల ద్వారా ఇంటింటికి తిరుగుతూ కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ



కన్వీనర్ రాఘవేంద్రరావు, నాగులు గౌడ్, బుచ్చిరెడ్డి, మనోహర్, గుండె గణేష్ ముదిరాజ్,పట్టాభిరామ్ చందు, రత్నకుమార్, ఆంజనేయులు, శివరాజ్, సురేష్, శ్రీను, ప్రసాద్ , జిల్లా ,రాష్ట్ర నాయకులు ఓబీసీ మోర్చా, దళిత మోర్చా ,ఎస్టి మోర్చా, యువ మోర్చా, డివిజన్ పదాధికారులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## ఘనంగా బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**నల్లగొండ ఆగస్టు 3 ప్రభాత సూర్య** నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004- 05 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పట్టణం లోనిఆ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులంతా పాల్గొని తమ పాత అనుభవాలను గుర్తు చేసుకున్నారు.ఆనాడు వారి ఉపాధ్యాయులు వారిని బోధించడం వలన వారు ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరా, సుదర్శన్ రెడ్డి,యాదగిరి రెడ్డి,నిర్మల్ రెడ్డి,వెంకటేష్, శర్మ, పూర్వ విద్యార్థులు మన్న వేణు, శివ, ప్రభాకర్ ,సైదా,కవిత పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంఘం ఎన్నికలు

**-ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంఘం అధ్యక్షులుగా బోయపాటి కృష్ణకుమారి**



**ఖమ్మం(సూర్య ప్రతినిధి)** ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం లారీ యూనియన్ ఆఫీస్ లో జరిగాయి.ఇప్పటికే అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు ఇద్దరు జాయింట్ సెక్రటరీలు పదవులు ఏకగ్రీవం కాగా మరో ఉపాధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి పదవి కోసం జరిగిన ఎన్నికల పోటీలో ప్రధాన కార్యదర్శిగా బోయ శ్రీను ఉపాధ్యక్షుడు గా ఇండిపెండెంట్ అభ్యర్థి పొట్లపల్లి సర్వయ్య పై తేజావత్ వీరన్న 78 ఓట్లతో విజయం సాధించారు.నాలుగు కీలక పదవులతో పాటు ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్ల పదవులు ఇంతకు ముందే ఏకగ్రీవయ్యాయి. ఇందులో అధ్యక్షులుగా బోయపాటి కృష్ణకుమారి ఉపాధ్యక్షుడిగా బి శ్రీనివాస్ జాయింట్ సెక్రటరీగా మస్తాన్ వలి మహమ్మద్ అలీమ్ తో పాటు ట్రెజరర్ గా చంద్ర సీతారాం తో పాటు మరో ఎనిమిది మందిని ఈసీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.లారీ ఆఫీస్ లో సంబరాలు అంబరాన్ని అంటాయి.

# విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

**-స్కేటింగ్ ఛాంపియన్షిప్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంబిటస్ ది స్కూల్ విద్యార్థులు**

**-అంబిటస్ విద్యాసంస్థల చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి**




**చౌటుప్పల్. ఆగస్టు 3. ప్రభాత సూర్య :**యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం, వలిగొండ రోడ్డు లోని అంబిటస్ ది స్కూల్ కు చెందిన విద్యార్థులు గ్రేటర్ హైదరాబాద్ ఇంటర్ స్కూల్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ - 2025, ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ హబ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో విశేష ప్రతిభను కనబరిచారు. అంబిటస్ ది స్కూల్ నుంచి 28 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 16 మంది విద్యార్థిని, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని పాఠశాల చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి తెలిపారు. స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రేటర్ హైదరాబాద్ ఇంటర్ స్కూల్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ - 2025, ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ హబ్ వారు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మెడల్స్ , సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను అంబిటస్ విద్యాసంస్థల చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలో విద్యార్థులు స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో రెండవసారి పాల్గొని తమ విశేష ప్రతిభను కనబరిచడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు స్కేటింగ్ కోచ్ సిహెచ్ సైదులు, పిఈటి ఉమాపతి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీల చైతన్యమే మన ఆలోచన సాధన సమితి లక్ష్యం







**-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లికార్జున్ గౌడ్**

**చౌటుప్పల్.ఆగస్టు 3. ప్రభాత సూర్య :** బీసీలను చైతన్యం చేయడమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి స్థాపించబడిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లికార్జున్ గౌడ్ అన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, గట్టుప్పల్, మునుగోడు, మండలంలో మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకుడు కటకం నర్సింగ్ రావు ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన బీసీ కులంలో చైతన్యం, భావజాల వ్యాప్తి కోసం, మన ఆలోచన సమితి (మాస్) రెండో విడత జెండా ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోద మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 37 నియోజకవర్గలలో, 350 గ్రామాలు మాస్ జెండాలు ఎగురవేయడం జరిగిందన్నారు .అందులో భాగంగా మునుగోడు నియోజకవర్గంలో 30 గ్రామాల్లో మాస్ జెండా ఎగురవేయడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా బీసీల ఐక్యత కోసం ఈ సంస్థ పోరాడుతుందని పేర్కొన్నారు.బీసీల జాతి సంపదను ఆర్థిక వనరులను చట్టసభల్లో వాటాను ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తూ రాజకీయ రాజ్యాధికారం సాధించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, బాతారాజు యాదగిరి రజక, కోడెం రాములు నేత, కొయ్యడ సురేష్ గౌడ్, గంజి లక్ష్మీనారాయణ, ఉప్పల వెంకటేష్ శికిల మెట్ల ప్రభాకర్ కొప్పు రామకృష్ణ,బైకని నరేందర్ యాదవ్,రాసమల్ల సంపత్, సంజయ్, బద్దం సాయికిరణ్, విద్యావేత్తలు, బీసీ కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

# బీసీలను చైతన్యం చేయడమే మన ఆలోచన సాధన సమితి లక్ష్యం

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లికార్జున్ గౌడ్**




**సంస్థాన్ నారాయణపూం, ఆగష్టు 03( ప్రభాత సూర్య )**బీసీలను చైతన్యం చేయడమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి స్థాపించబడిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లికార్జున్ గౌడ్ అన్నారు, మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురం మండలంలో మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకుడు కటకం నర్సింగ్ రావు ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన మన ఆలోచన సమితి జెండా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 350 గ్రామాలు 37 నియోజకవర్గ లలో ఈ జెండాలు ఎగురవేయడం జరిగింది.అందులో భాగంగా నారాయణపురం మండలం లో 11 గ్రామాల్లో కూడా ఎగురవేయడం జరిగిందన్నారు.రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా బీసీల ఐక్యత కోసం ఈ సంస్థ పోరాడుతుందని పేర్కొన్నారు. బీసీల జాతి సంపదను ఆర్థిక వనరులను చట్టసభల్లో వాటాను ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తూ రాజకీయ రాజ్యాధికారం సాధించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఉప్పల వెంకటేష్ శికిల మెట్ల ప్రభాకర్ కొప్పు రామకృష్ణ,బైకని నరేందర్ యాదవ్,రాసమల్ల సంపత్,సంజయ్,బద్దం సాయికిరణ్, నాతి లక్ష్మణ్, క్రైసర్, నాతి రాజు, వావిళ్ళ శ్రీకాంత్, మెరుగు పురుషోత్తం వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించం

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్**



**నల్లగొండ -ఆగస్టు 3 ప్రభాత సూర్య** బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆదివారం పట్టణంలోని రత్న ఫంక్షన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,బిజెపి నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీ జాబితాలో ముస్లింలను కలిపినారు అని వంకతో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు తమ వైఖరి మార్చుకోకపోతే వారి పర్యటనలను ఆడుకుంటామన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆగస్టు రెండో వారంలో సడక్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు రిజర్వేషన్ల విషయంలో చర్చించడానికి బిజెపి నాయకులు రావాలని సవాల్ విసిరారు .హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలోకి వచ్చిన కూడా ఏమీ లేదని, సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నైనా చర్చించుకుందాం అని సవాల్ విసిరారు. అవసరమైతే హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చర్చ పెడదామన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజీ కూడా బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ సి ఐ కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని హర్షం వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీ కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపడం హర్షనేమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కాసోజు విశ్వనాథం, నేలపట్ల సత్యనారాయణ, నాయకులు చోల్లెటి రమేష్, గోపాలకృష్ణ, ఆదినారాయణ, కేసబోయిన శంకర్ ముదిరాజ్, నల్ల మధు యాదవ్, లాలయ్య, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎ నగర్ పోచమ్మ తల్లీ ఆలయ కమిటీ ఆధ్వర్యం లో అన్నదానం..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** మియాపూర్ డివిజన్ పరిధిలో ని ముజఫర్ అహ్మద్ నగర్ కాలనీ ఆదివారం నాడు శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ కమిటీ సభ్యుల అద్వర్యంలో అమ్మ వారి ఆలయం వద్ద అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఒడిబియ్యం అన్నదాన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. శివ సత్తులు రాకేష్, దుర్గయ్య లను దేవాలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.అనిల్ కుమార్, పోచమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు దూలం రాజు గౌడ్, జెనరల్ సెక్రటరీ దేవేందర్, కమిటీ సభ్యులు వెల్డింగ్ రాజు, పి.రాజు, మధు, పవన్ నేత, మల్లేష్, చాకలి రాములు, మోహన్, డప్పు రాములు, బండి రామకృష్ణ గౌడ్, కాలనీ మహిళలు నర్సమ్మ, కే. లక్ష్మీ, రాధిక, సుగుణ, జి. లక్ష్మీ, మొగలమ్మ, డి. సుజాత, డి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## అలరించినా వారంతాపూ

**సాంస్కృతిక కార్యక్రమాలు...**



మాదాపూర్ ప్రభాత సూర్య :మాదాపూర్ లో ని శిల్పారామం లో యంపీ థియేటర్ లో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిశృంఖలా డాన్స్ అకాడమీ శ్రీమతి సంధ్య రాజు శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది రామ రామ, ఎలమంచ, డోలాయంచాల, భావములోన, మాతే మలయధ్వజ , భాగ్యదా లక్ష్మి, రామచంద్రయ్య, హరివారసనం, స్వాగతం కృష్ణ, కలియనర్తనం, కాలభైరవాష్టకం, శివ శంభో, దశావతారం, అంశాలను అధ్య, చేతన, భాగ్యలక్ష్మి, హాసిని, నందిని, శ్రీయ, ఖ్యాతి, జోస్య, వాసుకి, నియతి, లక్ష్మినైనికా, గౌతమ్ సర్వాణి, వైనవి మొదలైన వారు శ్రీ వెంకట్ గంగాధర్, మేఘ, మనీష, లక్ష్మి, ధన ఆధ్వర్యం లో ప్రదర్శించారు.


## రెజ్లింగ్ పోటీల్లో రెండు స్వర్ణాలు సాధించిన ధ్రువన్ సత్యవర్మ కు ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సన్మానం..



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :కొండాపూర్ కు చెందిన ధ్రువన్ సత్య వర్మ అండర్ 11 రెజ్లింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. అండర్ 11 రెస్లింగ్ పోటీలను ఛత్తీస్ ఘడ్ లో నిర్వ హించినట్లు ధ్రువం సత్య వర్మ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం ధ్రువన్ సత్య వర్మను తన నివాసంలో ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరిక పూడి గాంధీ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సాహం ఇవ్వాలని తల్లిదండ్రులకు చెప్పారు ఇలానే మన దేశానికి మంచి పేరు తేవాలని భవిష్యత్తులో ఇంకా అనేక రకాల రంగాలలో ధ్రువం సత్య వర్మ విజయం సాధించాలని ఆశీర్వదించారు. ధ్రువన్ సత్య వర్మ తల్లిదండ్రులను అభినందించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు జె.బలరామ్ యాదవ్, రాజమోహన్ రావు, రమేష్ యాదవ్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురం ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం





**ఖమ్మం (సూర్య ప్రతినిధి)** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు ఎస్ విజయ్ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీలో ప్రజలు అనేక సమస్యలకు గురి అవుతున్నారు కనీస మౌలిక సదుపాయాలు సిసి రోడ్లు డ్రైనేజీ వీధి దీపాలు మిషన్ భగీరథ రైతు బజారు గ్రంథాలయం మినీ స్టేడియం వాకింగ్ ట్రాక్ మక్కా పురుగుల నిర్మూలన మొదలగు సమస్యలను ఈ సమావేశం నందు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సంఘ కార్యదర్శి ఎర్రమల శ్రీనివాసరావు మున్సిపాలిటీ పరిధిలోని కాలనీ సమస్యలను ఏకరవు పెట్టారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘ అధ్యక్షులు తెలంగాణ జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా వివక్షతకు గురి అయి అభివృద్ధికి నోచుకోని ఖమ్మం రూరల్ మండలంలోని కొన్ని గ్రామాలను ఎదులాపురం పరిధిలోని 50 వెంచర్లను కలుపుతూ ఏదులాపురం మున్సిపాలిటీగా ఏర్పరిచిన రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేస్తూ మున్సిపాలిటీని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉంది అని గుర్తు చేశారు. ఆర్టిఐ కమిషనర్ పివీ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలోని ప్రజలు కనీస అవసరాలు కోరుకుంటున్నారు అందించాల్సిన బాధ్యత పాలకులది ప్రభుత్వాలది అని అవి సాధించుట కొరకు ప్రజానీకం ఉద్యోగస్తులు పోరాటాల ద్వారానే సాధించుకోవాలి అని కోరినారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ నేను పాలేరు నియోజకవర్గం నకు చెందిన వాడిని ఈ సంఘానికి ఎటువంటి సహాయ సహకారాలు అయినా అందించడానికి సిద్ధంగా ఉంటాను మీరు ఎల్లప్పుడూ నా దగ్గరికి రావచ్చు అని చెప్పారు. మక్కా పురుగుల నిర్మూలన తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఏదులాపురాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మంత్రి పొంగులేటి పెట్టుకొని ఏదులాపురం మున్సిపాలిటీగా మార్చి దేశంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు రచించారు అవి పూర్తి చేస్తారు అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు ఉద్యోగ సంఘం జేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు గుంటపల్లి శ్రీనివాస్ కస్తాలా సత్యనారాయణ అధ్యక్షులు కార్యదర్శులు వర్ష పుల్లయ్య రవికుమార్ మోదుగు వేలాద్రి గౌరవ అధ్యక్షులు ఊడుగు వెంకటేశ్వర్లు అసోసియేట్ అధ్యక్షులు బి శోభన్ జమ్మి జయపాల్ కిషన్ నాయక్ దరావత్ రాములు ఎన్ శంకర్ కోశాధికారి గందసరి మల్లయ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి వై దేవయ్య ప్రచార కార్యదర్శి పేరుమాలపల్లి శ్రీనివాసులు మహిళా కార్యదర్శి డి నాగమణి రాణి శ్రీదేవి ఉపాధ్యక్షులు కార్యదర్శులు టి వెంగళరావు మద్ది పుల్లయ్య గుండ మధుకర్ రెడ్డి తెగుళ్ల శ్రీనివాస్ గుంటి మల్లికార్జున్ జె వీరన్న వై సాయిబాబా కిషన్ నాయక్ రాముడు నాయక్ సుంకర శ్రీనివాస్ మొదలుగువారు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

-గుట్కా,పాన్ మసాలాలు, అక్రమ మద్యం స్వాధీనం...

-చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్

**చౌటుప్పల్.ఆగస్టు 3. ప్రభాత సూర్య:** ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్ హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ నిషేధిత గుట్కా, పాన్ మసాలాలను, అక్రమ మద్యం సీసాలను చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ మన్మథ కుమార్ బృందం ఆదివారం జరిపిన ఆకస్మిక తనిఖీలో పట్టుకున్న ఘటన చోటుచేసుకుంది. సిఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పోలీసుల తనిఖీలలో భాగంగా పట్టణ కేంద్రంలోని వివిధ కిరాణా షాపులను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే గుట్కా సాగర్, పాన్ మసాలాలు వంటివి పలు కిరాణా షాపులలో అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు తమ పోలీసు తనిఖీ బృందం అట్టి షాపులపై రైడ్ చేయడం జరిగిందన్నారు. భారీ మొత్తంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను, పాన్ మసాలాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలకు హాని కలిగించే పాన్ మసాలాలు, గుట్కా, మద్యం లాంటి మత్తు పదార్థాలను ఎవరైనా అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐబీ 04,ఎంసీ 03,ఓసీ 04, కే కే10,కేఫ్ బీర్14,మన్షన్ హౌస్ 01,మొత్తం దాదాపు గా 13 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే పలు కిరాణా షాపులపై జరిపిన తనిఖీలలో ఉమ్రా టొబాకో - 20 ప్యాకెట్స్, సాగర్ పాన్ మసాలా - 96 ప్యాకెట్స్, స్వాగత్ తంబాకు 18 ప్యాకెట్స్, విమల్ పాన్ మసాలా 96 ప్యాకెట్స్, రాజు నివాస్ 15 ప్యాకెట్స్, హార్ట్ ప్రీమియం పాన్ మసాలా 42 ప్యాకెట్స్, హెచ్-5 - 68 ప్యాకెట్స్, రాజశ్రీ పాన్ మసాలా 9 ప్యాకెట్స్, శేఖర్ పాన్ మసాలా 17 పాకెట్స్, కేపీ బ్లాక్ లేబుల్ తంబాకు 14 ప్యాకెట్స్, బహర్ హెరిటేజ్ పాన్ మసాలా 3 ప్యాకెట్స్, ఎస్ ఆర్ వన్ తంబాకు 94, ప్యాకెట్స్ ఆర్ ఎన్ జీరో వన్ తంబాకు 80 ప్యాకెట్స్, సాగర్ పాన్ మసాలా 96 ప్యాకెట్స్ విమల్ పాన్ మసాలా 8 ప్యాకెట్స్ రాజ్ నివాస్ 23 ప్యాకెట్స్,శేఖర్ పాన్ మసాలా 105, ప్యాకెట్స్ తంబాకు 26, ప్యాకెట్స్ ఎస్ ఆర్ వన్ తంబాకు 99, ప్యాకెట్స్ వన్ తంబాకు 121 ప్యాకెట్స్, వి1 తంబాకు బిగ్ 10 ప్యాకెట్స్, తంబాకు స్మాల్ 99 ప్యాకెట్స్ ప్రభుత్వ నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకొని అమ్మకపు దారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడినట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అట్టి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సీఐ మన్మథ కుమార్ వెల్లడించారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తాం


మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**రామడుగు, ఆగష్టు 03(ప్రభాత సూర్య):** రేషన్ కార్డు కలిగి ఉండాలన్న ప్రతి పేదోడి కళను సాకారం చేస్తూ రామడుగు మండలం షానగర్ లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిసి సంక్షేమం, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ లబ్ధిదారులకు ఆహార భద్రత ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డుల ఊసే లేకుండా పేదోళ్ల పొట్ట కొట్టారని, ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా నియంత పరిపాలన కొనసాగించారన్నారు. కానీ మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడమే కాకుండా పేదోడి కడుపు నింపాలన్న సంకల్పంతో సన్న బియ్యం పంపిణీ చేస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియని ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చొప్పదండి నియోజకవర్గంలో ఇరిగేషన్ కు సంబంధించిన పెండింగ్ లో ఉన్న అన్ని పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని, చొప్పదండిలో ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్థానిక శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుని తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా నీతి నిజాయితీతో కూడిన ప్రజా పరిపాలన అందిస్తున్న ఆయన్ని మళ్ళీ అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ ఆలం గౌస్ పాషా సివిల్ సప్లైఅధికారులు, రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మరమ్మత్తులు చేసి ఆర్ వో ప్లాంట్ తిరిగి ప్రారంభించిన భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్

ప్రారంభించిన దక్షిణ మధ్యక్షేత్ర బివిపి సంయుక్త కార్యదర్శి పసుపులేటి నరేంద్ర కృష్ణ





**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 03( ప్రభాత సూర్య )::** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల చిమిర్యాల గ్రామంలో గ్రామస్తులకు త్రాగు నీటిని అందించాలని గొప్ప ఉద్దేశంతో భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ 2015వ సంవత్సరంలో ఆర్వో ప్లాంట్ ను స్థాపించారు. సుమారు 15 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంట్ ను ప్రజా ప్రయోజన కోసం గ్రామానికి అప్పగించారు. పరిస్థితుల కారణంగా కాలక్రమేన ప్లాంట్ సరిగా నిర్వహించబడలేదు చివరికి పనిచేయలేదు. గ్రామస్తులు లేవనెత్తిన ఆందోళనలు అభ్యర్థనలను ప్రతి స్పందిస్తూ భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ తిరిగి సమాజానికి మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ట్రస్ట్ అవసరమైన నిధులను మంజూరు చేసింది. అవసరమైన మరమ్మత్తులు చేసి, ఆర్ ఓ ప్లాంట్ పూర్తి పని స్థితికీ పునరుద్ధరించబడిందని నిర్ధారించింది. ఈ సందర్భంగా ఆదివారం దక్షిణ మధ్య క్షేత్ర బివిపి సంయుక్త కార్యదర్శి పసుపులేటి నరేందర్ కృష్ణ చేతుల మీదుగా తిరిగి ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో లవ కుమార్ గౌడ్, కొమరం భీం బ్రాంచ్ అధ్యక్షులు చికూరి వెంకటేశం గౌడ్, బ్రాంచ్ సంస్కార్ కన్వీనర్ చినుకని యువరాజు, దోనూరి వీరారెడ్డి, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశంసా పత్రం అందుకున్న బాతరాజు నరసింహారాజు



**చౌటుప్పల్.ఆగస్టు 3. ప్రభాత సూర్య :** ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో 126 మంది బాల కార్మికులను విముక్తి కల్పించడంలో కీలక పాత్ర పోషించిన స్కోప్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ బాతరాజు నరసింహ రాజును సిపి సుధీర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ.. బాల కార్మికులు లేని సమాజం నిర్మాణంలో ప్రతి ఒక్కరు తన వంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. చౌటుప్పల్ డివిజన్ పరిధిలో 11వసారి నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న బి నరసింహ రాజు సేవలను రాచకొండ సీపీ సుధీర్ బాబు గుర్తించి నేరేడ్మెట్ లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అప్రిషియేషన్ సర్టిఫికెట్ ను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహ రాజు మాట్లాడుతూ.. చౌటుప్పల్ డివిజన్ పరిధిలో 126 మంది బాల కార్మికులను విముక్తి కల్పించడం జరిగింది అన్నారు. తన సేవలను రాచకొండ సిపి సుధీర్ బాబు గుర్తించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బాల కార్మికులు లేని సమాజం కొరకు తాను నిరంతరం శ్రమిస్తానని నరసింహ రాజు తెలిపారు.

## ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం



**నల్గొండ ఆగస్టు 3 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్రంలోని రత్న ఫంక్షన్ హాల్ లో ఆదివారం రిటైర్డ్ బీసీ సంక్షేమ శాఖ అధికారి భువనగిరి పోలగోని యాదయ్య సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండలి శాసనసభ్యులు నెల్లికంటి సత్యం, బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్, మరియు కల్లు గీత పారిశ్రామిక మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ హాజరై సన్మానించి మాట్లాడారు నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టపడి టైపిస్టు ఉద్యోగిగా నుండి తదానంతరం ప్రమోషన్ల ద్వారా నేడు బీసీ సంక్షేమ అధికారిగా రిటైర్డ్ అయినందుకు చాలా సంతోషం అని తెలిపారు. తమ శేష జీవితం ఆనందం గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయదుర్గా, ఉదయ్,పావని, రవితేజ, మంగమ్మ బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు

## చిన్ని కృష్ణ గ్రానైట్ టైల్స్ షాప్ ను ప్రారంబించిన ఆకుల ఇంద్రసేనారెడ్డి



**చౌటుప్పల్.ఆగస్టు 3. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మున్సిపాలిటీ వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చిన్ని కృష్ణ గ్రానైట్ అండ్ టైల్స్ షాప్ ను ప్రారంభించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి పాల్గొని వారి చేతుల మీదుగా ప్రారంభించారు .ఈ సందర్భంగా షాపు నిర్వాహకులు గుండెబోయిన అంజయ్య, యాదవ్, వెంకటేశ్ యాదవ్, కుమార్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ ను ఆకుల ఇంద్రసేనారెడ్డి అభినందిచారు. ఈ కార్యక్రమంలో లక్కారం మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్,లక్కారం మాజీ సర్పంచ్, మత్స్య సహకార సంఘాల యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పాశం సంజయ్ బాబు, నాయకులు గుండెబోయిన రవికుమార్, గుండెబోయిన అయిలయ్య, జటంగి కృష్ణ, గోపనబోయిన మహేష్ యాదవ్, కాసర్ల విష్ణువర్ధన్ రెడ్డి, ఉ,పాశం రాజేష్ ముదిరాజ్, ఉడుత నరసింహ తోటకూర జంగయ్య, దేవిరెడ్డి శ్యామ్, పాత్రికేయులు ఎర్రసాని సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు,

## ఘనంగా కుమ్మరుల ఆధ్వర్యంలో శ్రావణమాస బోనాలు



**చౌటుప్పల్.ఆగస్టు 3. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోనీ తంగడపల్లి రోడ్లో ఉన్న బంగారు కట్ట మైసమ్మ తల్లికి ఆదివారం తంగడిపల్లి గ్రామ కుమ్మరి సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రావణ మాస బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాలివాహన మండల కన్వీనర్ సిలివేరు శ్రీనివాసు, తాడూరి పరమేష్ లు పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వము బోనాల పండుగకు ప్రత్యేక ప్రాముఖ్యతను కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా అమ్మవారి ఆలయాలలో పూజారులుగా ఉండే విధంగా జీవోను తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కుమ్మరి సంఘం అధ్యక్షులు సిలువేరు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి సిలువేరు శ్రీకాంత్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు సిలువేరు యాదేశ్, గౌరవ సలహాదారులు సిలువేరు నరసింహ, సంఘం పెద్దలు సిలివేరు యాదయ్య, ఊశయ్య, కృష్ణ,శంకరయ్య, నరసింహ, జంగయ్య, బిక్షపతి, గాలయ్య, ముత్యాలు, సత్యనారాయణ, పెంటయ్య, శివ, మహిళలు పాల్గొన్నారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు







-గుట్కా,పాన్ మసాలాలు, అక్రమ మద్యం స్వాధీనం...
-చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్

**చౌటుప్పల్.ఆగస్టు 3. ప్రభాత సూర్య:** ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ నిషేధిత గుట్కా, పాన్ మసాలాలను, అక్రమ మద్యం సీసాలను చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్ బృందం ఆదివారం జరిపిన ఆకస్మిక తనిఖీలో పట్టుకున్న ఘటన చోటుచేసుకుంది. సిఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పోలీసుల తనిఖీలలో భాగంగా పట్టణ కేంద్రంలోని వివిధ కిరాణా షాపులను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే గుట్కా సాగర్, పాన్ మసాలాలు వంటివి పలు కిరాణా షాపులలో అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు తమ పోలీసు తనిఖీ బృందం అట్టి షాపులపై రైడ్ చేయడం జరిగిందన్నారు. భారీ మొత్తంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను, పాన్ మసాలాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలకు హాని కలిగించే పాన్ మసాలాలు, గుట్కా, మద్యం లాంటి మత్తు పదార్థాలను ఎవరైనా అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐబీ 04,ఎంసీ 03,ఓసీ 04, కే కే10,కేఫ్ బీర్14,మన్షన్ హౌస్ 01,మొత్తం దాదాపు గా 13 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే పలు కిరాణా షాపులపై జరిపిన మసాలా - 96 ప్యాకెట్స్, స్వాగత్ తంబాకు 18 ప్యాకెట్స్, విమల్ పాన్ మసాలా 96 ప్యాకెట్స్, రాజు నివాస్ 15 ప్యాకెట్స్, హార్ట్ ప్రీమియం పాన్ మసాలా 42 ప్యాకెట్స్, హెచ్-5 - 68 ప్యాకెట్స్, రాజశ్రీ పాన్ మసాలా 9 ప్యాకెట్స్, శేఖర్ పాన్ మసాలా 17 పాకెట్స్, కేపీ బ్లాక్ లేబుల్ తంబాకు 14 ప్యాకెట్స్, బహర్ హెరిటేజ్ పాన్ మసాలా 3 ప్యాకెట్స్, ఎస్ ఆర్ వన్ తంబాకు 94, ప్యాకెట్స్ ఆర్ ఎన్ జీరో వన్ తంబాకు 80 ప్యాకెట్స్, సాగర్ పాన్ మసాలా 96 ప్యాకెట్స్ విమల్ పాన్ మసాలా 8 ప్యాకెట్స్ రాజ్ నివాస్ 23 ప్యాకెట్స్,శేఖర్ పాన్ మసాలా 105, ప్యాకెట్స్ తంబాకు 26, ప్యాకెట్స్ ఎస్ ఆర్ వన్ తంబాకు 99, ప్యాకెట్స్ వన్ తంబాకు 121 ప్యాకెట్స్, వి1 తంబాకు బిగ్ 10 ప్యాకెట్స్, తంబాకు స్మాల్ 99 ప్యాకెట్స్ ప్రభుత్వ నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకొని అమ్మకపు దారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడినట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అట్టి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సీఐ మన్మధ కుమార్ వెల్లడించారు.

# నాడు ఆదరణ.. నేడు నిరాదరణ

**అద్భుత పథకానికి మంగళం**
**కిట్ల కోసం దవాఖానల్లో ఎదురుచూపులు**
**గజ్వేల్ మాతాశిశు దవాఖానలో ప్రతినెలా 400 వరకు డెలివరీలు**
**కిట్ అందక ఇబ్బంది పడుతున్న బాలింతలు**



**గజ్వేల్ :** ప్రభుత్వ దవాఖానల్లో పుట్టిన పిల్లల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్‌ను దిగ్విజయంగా అమలు చేసింది. ఈ పథకం ప్రజల్లో ఎంతో ఆదరణ పొందింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేసీఆర్ కిట్‌ను పక్కన పెట్టి పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కేసీఆర్ కిట్లను సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూడడంలేదు. దీంతో నాడు ఎంతో ఆదరణ పొందిన పథకం.. నేడు అటకెక్కింది. ప్రభుత్వ దవాఖానల్లో కిట్లను అందించకపోవడంతో బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో 16 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవించిన బాలింతలకు పంపిణీ చేయడంతో పాటు ఆడశిశువు జన్మిస్తే రూ.13వేలు, మగ శిశువు జన్మిస్తే రూ.12వేలను ఖాతాలో జమ చేసింది. వీటన్నింటికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడినట్లు పరిస్థితులను బట్టి తెలుస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీ అయిన మహిళలకు కిట్ అందక ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ కిట్ అమలు తర్వాత సర్కార్ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ఒకవైపు, మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూనే మరోపక్క కేసీఆర్ కిట్‌తో పాటు ప్రోత్సాహకంగా కేసీఆర్ ప్రభుత్వం డబ్బులు అందజేసింది. మహిళలు గర్భం దాల్చిన తరువాత గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణుల వివరాలు సేకరించేవారు. అనంతరం వారి వివరాలను ఆన్‌లైన్ చేసి దవాఖానల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి డబ్బులు ఖాతాలో జమచేసేవా రు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ దవాఖానలో డెలివరీ అయిన తర్వాత 102 వాహనంలో తల్లీబిడ్డను తీసుకెళ్లి ఇంటి వద్ద వదిలి పెట్టేవారు. నేడు కాంగ్రెస్ ప్రభు త్వం ఇవన్నీ అమలు కావడం లేదు.

**గజ్వేల్ ఎంసీహెచ్‌లో..**

గజ్వేల్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో(ఎంసీహెచ్) ప్రతిరోజు 15 నుంచి 20వరకు డెలివరీలు అవుతున్నాయి. అందులో సాధారణ ప్రసవాలకు ఎక్కువగా వైద్యులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రతినెలలో ఒక్క గజ్వేల్ దవాఖానలోనే 350 నుంచి 400వరకు డెలివరీలు అవుతున్నాయి. వీరంతా కిట్ అందుకోలేకపోతున్నారు. కేసీఆర్ కిట్‌కు వచ్చిన ఆదరణను చూసి ఈ పథకాన్ని ఇలాగే కొనసాగిస్తే కేసీఆర్‌కే పేరు వస్తదనే భయంతో కిట్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం స్వస్తి పలికిందనే ఆరోపణలు ఉన్నాయి.

**ఎంసీహెచ్‌గా పేరు మార్పు..**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేసీఆర్ హయాంలో మిగిలిన కిట్లను స్టాక్‌లో ఉన్న వాటికి కేసీఆర్ ఫొటో ఉంటే దానిపై స్టిక్కర్ అతికించి కేసీఆర్ కిట్ పేరుకు బదులు మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) పేరుగా మార్చి అందుబాటులో ఉన్న వాటిని అందించారు. పాత స్టాక్ అయిపోయిన తర్వాత కొత్త కిట్ల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇప్పటికి గ్రామాల్లో గర్భిణుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు ఆశ వర్కర్లు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నప్పటికీ కిట్లు, డబ్బులు అందడం లేదు. కిట్లు, డబ్బులు ఇవ్వకుండా వివరాలు సేకరించడంతో గర్భిణులు ఆశ కార్యకర్తలను తమ వివరాలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు.

# డిసెంబర్ 9లోపు ప్యాకేజీ పూర్తి చెల్లింపు

## సీఎం హామీని తెలియజేసిన అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల :** డిసెంబర్ 9 లోపు సీఎం హామీతో ప్రతి రూపాయిని ఉదండాపూర్ వల్లూరు ముంపు గ్రామస్తుల ఇంటికి చేర్చే బాధ్యత తనదేనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 175 కోట్ల రూపాయలను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద విడుదల చేసిన శుభ సందర్భంగా ఆదివారం ఉదండాపూర్ రిజర్వాయర్లో ముంపు గ్రామాల ప్రజలకు సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. విలక్షణ రాజకీయ లక్షణాలతో రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు వినూత్న రీతిలో వేల మందికి భోజనం పెట్టి వారికి రావలసిన ప్రతి పైసా అందే వరకు వారికి అండగా నిలుస్తానని దీనికోసం ఏం చేయడానికైనా తాను సిద్ధమేనని ప్రకటించి నిర్వాసితుల గుండెల్లో కొండంత భరోసా నింపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల గూడును గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టించుకో పోగా వారి సమస్యలను గాలికి వదిలేసిన నేపథ్యంలో వారికి అండగా నిలబడతానని అవసరమైతే సర్కారుతోనైనా కలబడుతానని హామీ ఇచ్చి రంగంలోకి దిగిన అనిరుద్ రెడ్డి తన నిర్విరామ ప్రయత్నాలతో ఒకవైపు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని రూ.25 లక్షల కు పెంచే విషయంగా ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెస్తూనే, మరొకవైపు మూడు విడతలుగా రూ.250 కోట్లను నిర్వాసితుల ప్యాకేజీ కోసం మంజూరు చేయించారు. లక్షల మంది రైతుల బాగు కోసం ఉదండాపూర్ నిర్వాసితులు చేసిన త్యాగం అమూల్యమైనది. ఆ త్యాగధనుల కోసం చివరి వరకు తాను అండగా నిలబడతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఉదండాపూర్ ప్రాజెక్టు లో భాగమైన వల్లూరు గ్రామం వద్ద వేలాదిమంది నిర్వాసితులతో సహపంతి భోజనం చేశారు. వారికి తానే స్వయంగా అన్నం వడ్డించారు. పుట్టి పెరిగిన ఊర్లను, ఇళ్లను పోగొట్టుకుంటున్నామన్న బాధతో కంటతడి పెట్టుకుంటున్న వారికి భుజం తట్టి ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాకు ఫోన్ చేసి ఉదండాపూర్ భూ నిర్వాసితులకు మనం అండగా ఉండాలి, నీవు వెళ్లి వారికి నా తరపున భోజనం పెట్టమని చెప్పారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డిసెంబర్ 9వ తారీకు లోపు ఉదండాపూర్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులను పూర్తిగా చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసితులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి అనిరుద్ రెడ్డి గవర్నమెంట్ అని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీను, రామాంజనేయులు, జలంధర్, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి, కౌన్సిలర్లు చైతన్య చౌహన్, కుమ్మరి రాజు, సుంకసారి రమేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ల వెంకటయ్య, టౌన్ అధ్యక్షుడు మినాజోద్దీన్, మాజీ ఎంపీపీ నిత్యానందం, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు బాద్మీ ధ్రువ, మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, నేతలు అశోక్ యాదవ్, అనిల్ కుమార్, వంశీధర్ రెడ్డి, వంశి చారి, జగదీశ్వర చారి, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కలెక్టర్ హరిచందనపై సీఎస్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్



**హైదరాబాద్ :** కలెక్టర్ హరిచందన, సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ రేషన్ కార్డుల విషయంలో తప్పుడు ప్రకటనలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకుప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఇటీవల హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో హరిచందన, డీఎస్ చౌహాన్ పాల్గొన్నారని.. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేశారని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. 'గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డుల ఇచ్చిన దాఖలాలు లేవు. చాలామంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు' అని డీఎస్ చౌహాన్ అన్నారని తెలిపారు. అలాగే 'గత 12 ఏళ్ల కింద నేను సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రేషన్ కార్డులు ఇచ్చాం. మళ్లీ ఇప్పుడే ఇస్తున్నాం' అని హరిచందన వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ఇవన్నీ తప్పుడు ఆరోపణలేనని.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనల ప్రకారం 6.47 లక్షల రేషన్ కార్డులను ఇచ్చిందని ఆ లేఖలో వివరించారు. అధికారులు ప్రజాప్రతినిధుల మెప్పు కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇది ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న సదరు అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. అధికారుల పనితీరును డీపీవోటీకి నివేదించాలని కోరారు. సదరు అధికారులు బహిరంగ క్షమాపణతో పాటు వాస్తవాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి డివిజన్ లోగల లింగంపల్లి విలేజ్ లో బోనాల పండుగను పురస్కరించుకుని పోచమ్మ తల్లి,మహంకాళి తల్లి,నల్ల పోచమ్మ తల్లి ఆలయాల్లో విలేజ్ కమిటీ వారి ఆహ్వానానికి శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేఖపూడి గాంధీ, ఎంబీసీ చైర్మెన్ జెరిపేటి జైపాల్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.కార్పొరేటర్ మాట్లాడుతూ..అమ్మవారి కృప ఎల్లప్పుడూ శేరిలింగంపల్లి ప్రజలపై ఉండాలని, ప్రతి ఇంట్లో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం నిలకడగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.బోనాల వేడుకను, ఫలహారం బండి, తోట్టేల ఊరేగింపుల్లో అందరూ కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుథ్ యాదవ్, ఎస్ఎల్ విడి సి ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, కమిటీ జెనరల్ సెక్రటరీ దేవులపల్లి శ్రీనివాస్, పాశం రాజు, అధ్యక్షులు మేకల కృష్ణ, సోమయ్య యాదవ్, నీలి జ్ఞానేశ్వర్,ప్రణయ్ ముదిరాజ్, బుయ్య మల్లేష్ గౌడ్,సుభాష్ రాథోడ్,సూర్య రాథోడ్, పిల్లి అనిల్, రవి, శశి కిరణ్, బ్యాండ్ రాజు,బ్యాండ్ రమేష్,నవీన్ గౌడ్, నరేష్, గోపాల్ యాదవ్,నయీమ్ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.. ఎమ్మెల్యే కోవ లక్ష్మి




**వాంకిడి :** అర్హులందరూ కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్య కోవలక్ష్మి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శనివారం వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో పలువురి లబ్ధిదారులకి కొత్త రేషన్ కార్డుల పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ కవిత, డీటీ రామ్‌లాల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఆర్ఐలు, సింగిల్ విండో చైర్మన్ జాబో రే పెంటు, సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

**రెబ్బెనలో..**

రెబ్బెన, ఆగస్టు 2 : రెబ్బెన మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం లబ్ధిదారులకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎంపీడీవో శంకరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేశ్ ఉన్నారు.

## ప్రజా క్షేత్రంలోనే కాంగ్రెస్‌కు గుణపాఠం



**సిరిసిల్ల :** అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడంలో విఫలమయిందని కేటీఆర్ సేనా మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ విమర్శించారు. అబద్ధపు హామీలతో ప్రజలను పూర్తిగా మోసం చేసిందని, ప్రజాక్షేత్రంలోనే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాన్నారు. తంగళ్ళల్లి మండలం ఓబులాపూర్ కేటీఆర్ సేన గ్రామ శాఖ అధ్యక్షునిగా వోడ్నాల మహేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ యువతను చైతన్య పరిచి, గ్రామ గ్రామాన కేటీఆర్ సేనను బలోపేతం చేస్తామన్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసిన సంక్షేమ పథకాలను గడప గడపకు వివరిస్తామని చెప్పారు. ఏ ఎన్నిక వచ్చినా కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీనే గెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దోమల కొమురయ్య, కొత్త సంతోష్ గౌడ్, గోగు మల్లేశం,బొమ్మ దేవయ్య, నందగిరి నాగరాజు, నందగిరి సురేందర్, దోమల హరీష్, దోమల వంశీ, వోడ్నాల శ్రీకాంత్, తొట్ల శివాజీ, పోచంపల్లి కిషన్, పోచంపల్లి నితిన్, పరుస ప్రశాంత్, పరుస నవీన్, గుగ్గిళ్ళ ప్రశాంత్, అల్వాల చింటూ, కొత్త అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆ పోస్టర్‌తో నా కల నెరవేరింది: ఆనంద్ దేవరకొండ

ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం 2023 జూలై 13న విడుదలైంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డ్స్‌లో ఈ సినిమాకి ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్‌గా సాయి రాజేశ్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా పీవీఎన్ఎస్ రోహిత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చిత్రబృందం మాట్లాడారు. సాయి రాజేశ్ మాట్లాడుతూ– 'బేబి'సినిమాకు ప్రతి ఒక్కరూ హీరోనే... అంతా ప్రాణం పెట్టి పని చేశారు. మాకు వచ్చిన బెస్ట్ స్క్రీన్ ప్లే అవార్డ్ మా ఎడిటర్ విప్లవ్‌కి కూడా చెందాలి. నన్ను ఎవరూ నమ్మని రోజు ఎస్‌కేఎన్ నమ్మినందుకు థ్యాంక్స్" అని చెప్పారు. బేబి సినిమా కోసం టీమ్ మొత్తం ప్రాణం పెట్టి పని చేశాం. మా చిత్రం జాతీయ అవార్డు గెల్చుకోవడం ఆనందంగా ఉంది. నా సినిమా పోస్టర్ మీద నేషనల్ అవార్డ్ విన్నర్ అనే పేరు చూడటంతో నా కల నెరవేరిన అనుభూతి కలుగుతోందని హీరో ఆనంద్ దేవరకొండ తెలిపారు. బేబిలో ప్రేమిస్తున్నా అనే పాటకి బెస్ట్ సింగర్‌గా జాతీయ అవార్డు అందుకోనుండటం సంతోషంగా ఉందని సింగర్ పీవీఎన్ఎస్ రోహిత్ పేర్కొన్నారు. ఈ సినిమాలో నేనూ భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉందన్నారు హీరోయిన్ వైష్ణవి చైతన్య. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ బేబికి జాతీయ అవార్డులు రావడంతో మరిన్ని మంచి చిత్రాలు చేయాలనే బాధ్యత మాపై పెరిగిందని అన్నారు.



# తమిళ స్టార్ దర్శకులంతా ఒకే ఫ్రేములో.. నెట్టింట వైరల్‌గా మారిన పిక్

ఇటీవల సినీ పరిశ్రమలో రీ యూనియన్ ట్రెండ్ బాగా హైలైట్ అయింది. సీనియర్ నటీనటులు, దర్శకులు కలిసి గత జ్ఞాపకాలను పునరుద్ధాటిస్తూ ఆనందంగా గడిపేస్తున్నారు. ఇటీవల 90ల కాలంలో సూపర్ హిట్స్ అందించిన తమిళ్, తెలుగు నటీనటులు కలిసి రీ యూనియన్ పార్టీ చేసుకున్న సంగతి మనకు తెలిసిందే. తాజాగా, తమిళ్ సినీ పరిశ్రమకు వెలకట్టలేని కృషి చేసిన దర్శకులు ఒకే చోట సమావేశమై ఒక ఫోటో కోసం పోజ్ ఇవ్వగా, ఆ చిత్రాన్ని దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేశారు. ఈ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఫోటోలో గౌతమ్ వాసుదేవ్ మీనన్, నెల్సన్ దిలీప్ కుమార్ (ఈ జెనరేషన్‌కు బాగా పరిచితమైన దర్శకుడు), శంకర్ (విజువల్ వండర్స్‌కు కేరాఫ్ అడ్రస్), మణిరత్నం (క్లాసికల్ మాస్టర్‌పీసులకు మారుపేరు), మిస్కిన్ (ఇంటెన్స్ నరేషన్‌కి పేరుగాంచిన దర్శకుడు), లింగుస్వామి (కమర్షియల్ హిట్‌లకు స్పెషలిస్ట్), మురుగదాస్ (పాన్ ఇండియా విజయాల కారకుడు), కేఎస్ రవికుమార్ (సినిమా మాస్టర్, స్టార్ హీరోల ఫేవరెట్ డైరెక్టర్) అందరు కూర్చొని ఫొటోకి పోజులిచ్చారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో షేర్ చేసిన క్షణాల్లోనే వైరల్ అవగా, తమిళ్ ప్రేక్షకులతో పాటు తెలుగు సినీ ప్రేమికులు కూడా వీరందరు ఇలా కలవడం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "అందరూ కలిసి ఒకే ఫ్రేమ్‌లో ఉండడం అరుదైన సన్నివేశం", "ఈ ఒక్క ఫోటోలో సుమారు 100 బ్లాక్‌బస్టర్లు దాగున్నాయ్" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ రీ యూనియన్ పార్టీ ఎక్కడ జరిగింది? ఎందుకు సమావేశమయ్యారు అన్నదానిపై స్పష్టత రాకపోయినా, ఈ తరహా మీటింగ్‌లు టాలెంటెడ్ మేకర్స్ మధ్య బంధాన్ని బలపరిచే అవకాశం కల్పిస్తాయన్నది మాత్రం స్పష్టంగా అర్ధమవుతుంది.. సినిమా ప్రేమికులకు ఇది నిజంగా ఒక విజువల్ ట్రీట్.

# తెలుగులోకి రాబోతున్న కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రమ్ సో'




చిన్న సినిమాగా విడుదలై కన్నడలో బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సినిమా తెలుగులో విడుదల కాబోతుంది. ఈ సినిమా తెలుగు రైట్స్‌ని ప్రముఖ టాలీవుడ్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ దక్కించుకుంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది. జూలై 25న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తూ, విశ్లేషకుల ప్రశంసలు అందుకుంటోంది. రాజ్ బి శెట్టి సహ–నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రాన్ని జెపి తుమినాడ్ దర్శకత్వం వహించారు. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం, వినూత్నమైన కథాంశంతో కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. తాజాగా ఈ చిత్రం కన్నడలో అరుదైన రికార్డును నమోదు చేసుకుంది. కేవలం రూ.3 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు రూ.28 కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది. అంతేగాకుండా కేవలం మూడు రోజుల్లోనే ఈ చిత్రం 3.80 లక్షలకు పైగా టిక్కెట్లు అమ్ముడై, ఒకే రోజులో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో అత్యధిక టిక్కెట్లు అమ్ముడైన కన్నడ చిత్రంగా రికార్డు సృష్టించింది.




# అప్పుడే ఓటీటీలోకి గాలి జనార్ధనరెడ్డి కుమారుడి సినిమా

మాజీ మంత్రి, ప్రముఖ రాజకీయ నాయకుడు గాలి జనార్దన్ రెడ్డి కుమారుడు కిరిటీ రెడ్డి హీరోగా నటించిన మొదటి సినిమా జూనియర్. దర్శకుడు రాధాకృష్ణ రెడ్డి తెరకెక్కించిన ఈ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లో శ్రీలీల హీరోయిన గా నటించింది. అలాగే కన్నడ నటుడు రవిచంద్రన్, జెనీలియా డిసౌజా కీలక పాత్రలు పోషించారు. జులై 18న కన్నడతో పాటు తెలుగులో ఒకేసారి విడుదలైన జూనియర్ సినిమా ఓ మోస్తరుగా ఆడింది. ముఖ్యంగా ఇందులోని వైరల్ వయ్యారి పాట సోషల్ మీడియాను షేక్ చేసింది. శ్రీలీలతో పాటు కిరిటీ రెడ్డి వేసిన స్టెప్పులు సినిమాలో హైలెట్ గా నిలిచాయి. బాక్సాఫీస్ వద్ద ఓ మోస్తరుగా ఆడిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 9 నుంచే ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిజానికి ఈ సినిమా ఆగస్ట్ 15 న ఓటీటీలోకి రానుందని మొదట ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఒక వారం ముందే స్ట్రీమింగ్ కు రానున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వారాహి చలన చిత్రం బ్యానర్ పై తెరకెక్కిన ఈ సినిమాలో రావు రమేష్, సత్య, వైవా హర్ష, సుధారాణి వంటి ప్రముఖ టాలీవుడ్ నటులు యాక్ట్ చేశారు. అలాగే ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించడం విశేషం.




# వీకెండ్‌లో కింగ్‌డమ్ దూకుడు..

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ నటించిన కింగ్డమ్ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుపోతుంది. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన ఈ స్పై గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాకు మొదటి నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. భారీ అంచనాల మధ్య జూలై 31న విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ టాక్ అందుకుంది. అలాగే మొదటి రోజే భారీ వసూళ్లు రాబట్టింది. ఇప్పటివరకు విజయ్ కెరీర్ లోనే ఓపెనింగ్ రోజునే భారీ వసూల్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. ఇక ఆ తర్వాత రోజు సైతం కలెక్షన్ల సునామీ సృష్టిస్తుంది. మొదటి రోజు రూ.39 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం రెండు రోజులకు గానూ రూ.53 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టినట్లు చిత్రయూనిట్ తెలిపింది. తాజాగా కింగ్డమ్ మూవీ మూడు రోజుల కలెక్షన్స్ అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.67 కోట్లు గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు 53 కోట్ల వరుక థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఇక ఈ ఆదివారంతోపాటు వచ్చే వారం సైతం కింగ్డమ్ వసూళ్లు మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో విజయ్ మాస్ యాక్షన్ అదరగొట్టారు. ఇక ఇందులో విజయ్ , సత్యదేవ్ మధ్య వచ్చే సీన్స్ ఆకట్టుకున్నాయి. అనిరుధ్ రవిచంద్రన్ అందించిన బీజీఎమ్ సినిమాకు హైలెట్ అయ్యింది. ఈ చిత్రంలో విజయ్ జోడిగా భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించి సంగతి తెలిసిందే.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.